


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 266 | ఆదివారం 05 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## కేరళలో అధికారంలోకి వస్తాం

### - ప్రధాని నరేంద్ర మోడీ

తిరువంతనపురం - సూర్య వాస్తవం

కేరళలో బిజెపి నేతృత్వంలోని ఎల్‌డిఎ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్ట జిల్లాలోని తిరువల్లలో శుక్రవారం నాడు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేరళ అభివద్ధికి - మిగతా 2లో..

# అమెరికాకు గర్వభంగం

- 24 గంటల్లో రెండు యుద్ధ విమానాలను కూల్చిన ఇరాన్
- పైలట్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు
- టెహ్రాన్ అణు స్థావరాలు, పెట్రో కెమికల్ కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు
- నిలిచిన దౌత్య యత్నాలు



టెహ్రాన్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియా పోరు అంతకంతకూ తీవ్ర రూపు దాలుస్తోంది. అమెరికా-ఇజ్రాయిల్ ఉధృతంగా దాడులు చేస్తున్నప్పటికీ ఇరాన్ ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. పైగా యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యానికి అనూహ్యంగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చివేయగా ఇరాన్‌లోని పెట్రోకెమికల్ కేంద్రాలు, అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా-ఇజ్రాయిల్ సేనలు దాడులు చేశాయి. ఐదు వారాలుగా సాగుతున్న యుద్ధంలో తొలిసారిగా 24 గంటల వ్యవధిలోనే అమెరికాకు చెందిన రెండు - మిగతా 2లో..



## బీజేపీ హింసను రెచ్చగొట్టాలని చూస్తోంది

### - మమతా బెనర్జీ

కోల్‌కతా - సూర్య వాస్తవం

ఎన్నికల సందర్భంగా పశ్చిమబెంగాల్‌లో బిజెపి హింసను రెచ్చగొట్టాలని చూస్తోందని ఆరాష్ట్ర సిఎం మమతాబెనర్జీ వ్యాఖ్యానించారు. నేడు ఆమె మల్దాలోని మణీక్‌చక్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిజెపి చేసే ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు లొంగిపోవద్దని ప్రజలను కోరారు. బిజెపి హింసను రెచ్చగొట్టాలని చూస్తోంది. మాల్దాలోని మోతాబరిలో చేసినట్లుగానే ప్రజలను టార్గెట్ చేసుకోవడానికి - మిగతా 2లో..



## రూ.225కోట్లతో బాసర ఆలయ అభివృద్ధి

- పనులకు రేపు ముఖ్యమంత్రి శంకుస్థాపన
- ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనలు
- సంప్రదాయాలకనుగుణంగా మాస్టర్ ప్లాన్
- జ్ఞానసరస్వతి దేవాలయ అభివృద్ధిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సంప్రదా యాలను, శాస్త్రాలను పరిగణనలోకి తీసుకుని భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ.. బాసర ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. శనివారం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి పనులపై సీఎం సమీక్ష నిర్వహించారు. తొలుత బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. బాసర ఆలయ అభివృద్ధి పనులకు రూ.225 కోట్లు వ్యయమవుతుందని - మిగతా 2లో..

# 'రాజధాని' మరింత వేగం

- సకాలంలో పనులు పూర్తి చేయాలి
- గ్రీన్ ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్
- కాంట్రాక్టర్లతో సీఎం చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం

రాజధాని అమరావతిలో మరింత వేగంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సిఎం శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణమనేది ఒక కాంట్రాక్టు వర్కుగా చూడొద్దని, చరిత్రలో భాగస్వాములవుతున్నట్లుగా భావించాలని చెప్పారు. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించా లనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలని, నిర్మాణాలు నాణ్యతతో ఉండాలని, కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందేనన్నారు. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానమంత్రితో ప్రారంభోత్స వం చేస్తామన్నారు. వారానికి రూ.941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని, అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, ఆలోగా చేపట్టాల్సిన పనులు చేయాలని, నిధుల కొరత లేదన్నారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని,ో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. కృష్ణా జిల్లాలో అటవీ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని అధికారులు చెప్పిన అంశంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని, ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## నేడు 17 మండలాల్లో వడగాలులు

- విపత్తుల నిర్వహణ సంస్థ 2లో

## ఏళ్ల తరబడి కాంట్రాక్టు సేవలు దోపిడీయే

- పిటిషనర్ల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలి
- హైకోర్టు ఆదేశం



అమరావతి - సూర్య వాస్తవం:

తక్కువ వేతనంతో ఏళ్ల తరబడి ఉద్యోగుల సేవలు వినియోగించుకోవడం శ్రమదోపిడీ కిందకే వస్తుందని హైకోర్టు ఘాటుగా స్పందించింది. శాశ్వత ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల శ్రమ దోపిడీ పెరుగుతోందని చెప్పింది. తాత్కాలికం పేరుతో అవసరమైనప్పుడల్లా నిరంతరాయంగా - మిగతా 2లో..



## నేడు హైకోర్ట్ భవనానికి శంకుస్థాపన

-- హాజరుకానున్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, సీఎం రేవంత్ రెడ్డి 2లో

# కేరళలో అధికారంలోకి వస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి, మతతత్వం రెండు అతిపెద్ద అవరోధాలని చెప్పారు. శబరి రైలు ప్రాజెక్టును ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో తిరువళ్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. కేరళకు అపారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ, అభివద్ధి పరుగులో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని పేర్కొన్నారు. అయితే కేంద్ర నిధుల మంజూరులో తీవ్ర వివక్ష చూపి వేధింపులకు గురిచేసిన ఆయనే..ఇక్కడే ప్రాజెక్టుల పురోగతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని సభకు హాజరైన బిజెపి కార్యాకర్తలే వ్యాఖ్యానించడం కనిపించింది. కేరళలో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై కాంగ్రెస్ అనవసర ఆందోళనలు రేకెత్తిస్తోందని ప్రధాని విమర్శించారు. 'నేను ఇంతకు ముందు కూడా ఇక్కడికి వచ్చాను. కానీ ఈసారి మార్పు గాలులు మరో దిశలో వీస్తున్నాయి. కేరళ ప్రజల మూడ్ మారినట్టు కనిపిస్తోంది. కేరళలో అతిపెద్ద మార్పు జరగబోతోంది. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగుతుంది. కేరళలో మొదటి ి సారిగా బిజెపి నేతృత్వ కూటమి అధికారంలోకి రాబోతోంది' అని ఆయన చెప్పారు.

# బీజేపీ హింసను రెచ్చగొట్టాలని చూస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర సంస్థల్ని ఉపయోగిస్తోంది అని మమతా అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇవిఎంలు, వీవీప్యాట్ యంత్రాలను కాపాడుకోవాలని ఆమె మహిళలను కోరారు. ఇక మాల్దా ఘెరావ్ ఘనటపైనా ఆమె మాట్లాడారు. 'రెండు మతతత్వ పార్టీలు న్యాయ మూర్తులను ఘెరావ్ చేసి పారిపోయాయి. ఇప్పుడు ఎన్ఐఎ స్థానిక యువతను వేధిస్తోంది' అని మమతా అన్నారు. ఈ సందర్భంగా మాల్దాలో సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన ప్రజలతో మాట్లాడాలని అమిత్‌షాకు ఆమె సవాల్ విసిరారు.

# రూ.225కోట్లతో బాసర ఆలయ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

అంచనా వేశారు. ఈ అభివృద్ధి పనులకు ఈనెల 6న సీఎం శంకుస్థాపన చేసేలా ప్లాన్ చేశారు. మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు నిర్మించాలని అన్నారు. రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలని సూచించారు.

**సకల సౌకర్యాలతో మాస్టర్ ప్లాన్**

అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణం భవిష్యత్తులో భారీ వృక్షాలతో అలరారేలా అవసరమైన మొక్కలు నాటాలని సూచించారు. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని ఆదేశించారు. పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి భక్తులకు సేవలు అందించేందుకు అనువుగా నిర్మించాలని సూచించారు. ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలన్నారు. ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ద్వారానే చేరుకునేలా చూడాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడితే ఏ మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు హైకోర్ట్ భవనానికి శంకుస్థాపన

## -- హాజరుకానున్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - సూర్య వాస్తవం:** రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌లో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ హైకోర్ట్ భవనానికి ఆదివారం ఉదయం 10.30 గంటలకు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. శనివారం రాష్ట్రానికి చేరుకున్న చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, హైకోర్ట్ న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి ఇతర ప్రముఖులు సీజేకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. కాగా ముఖ్యమంత్రి సోమవారం బాసరకు వెళ్లనున్నట్టు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

# నేడు 17 మండలాల్లో వడగాలులు

## - విపత్తుల నిర్వహణ సంస్థ

**అమరావతి - సూర్య వాస్తవం:**

రాష్ట్రంలో ఎండలు తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం నాడు 17 మండ లాల్లో తీవ్ర వడగాడ్పులు, 32 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఆదివారం నాడు శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, బూర్జ, హిరమండలం, జలుమూరు, లక్ష్మీనర్సుపేట, పాతపట్నం, సారవకోట, సరుబుజ్జిలి, విజయనగరం జిల్లాలోని గుర్ల, సంతకవిటి పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, సీతంపేట, పోలవరం జిల్లాలోని గంగవరం, కూనవరం, తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరంలో తీవ్ర వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వడగాలులు ప్రభావం చూపే మండలాల్లో శ్రీకాకుళం జిల్లాలో 2, విజయనగరం జిల్లాలో 8, పార్వతీపురం మన్యం జిల్లాలో 9, పోలవరం జిల్లాలో 3, కాకినాడ జిల్లాలో 2, తూర్పుగోదావరి జిల్లాలో 2, ఏలూరు జిల్లాలో 3, ఎన్‌టిఆర్ జిల్లాలో 3 ఉన్నట్లు తెలిపారు.

# అమెరికాకు గర్వభంగం

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చివేసింది. ఏ-10 యుద్ధ విమానాన్ని శుక్రవారం హార్ముజ్ జలసంధి సమీపంలో కూల్చివేసిన ఇరాన్ తాజాగా ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ విమానాన్ని కూల్చింది. ఇందులో ఇద్దరు సిబ్బంది ఉండగా వారిలో ఒకరి ఆచూకీ తెలియడం లేదు. అతని కోసం ఇరాన్, అమెరికా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి.

గాలింపు చర్యలు చేపట్టిన రెండు అమెరికా బ్లాక్‌హాక్ హెలికాప్టర్లపై కూడా ఇరాన్ దాడి జరిపింది. అయితే అవి ఇరాన్ గగనతలం నుంచి దూరంగా వెళ్లిపోయాయి. శత్రు దేశాలకు చెందిన వారిని గుర్తించి సమాచారం ఇచ్చినా లేక చంపినా తగిన పారితోషికం అందజేస్తామని ఇరాన్ అధికారులు ప్రకటించారు. వ్యూహాత్మక జలసంధి పరిసరాలలో దక్షిణ దిశగా సంచరిస్తున్న ఏ-10 విమానాన్ని లక్ష్యంగా చేసుకున్న ఇరాన్ దానిని కువైట్ గగనతలంలో కూల్చివేసింది. ఆయుధ వాహనాలపై, శత్రు సైనికులపై భూతల దాడుల కోసం ఈ విమానాన్ని అమెరికా ఉపయోగిస్తోంది. ఇస్ఫహాన్ రాష్ట్రంపై అమెరికా ప్రయోగించిన ఎంక్యూ-1 డ్రోన్‌ను అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ సాయంతో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కూల్చివేసిందని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

ఇదిలావుండగా ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రం సమీపంలో అమెరికా వైమానిక దాడి జరిపింది. ఈ ఘటన లో ఓ సెక్యూరిటీ గార్డు చనిపోగా అక్కడి భవనం దెబ్బ తిన్నది. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేయడం ఇది నాలుగోసారి. దక్షిణ ఇరాన్‌లోని ఖుజెస్థాన్ రాష్ట్రంలో ఉన్న రెండు పెట్రోకెమికల్ కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయిల్ సేనలు జరిపిన దాడులలో ఒకరు మరణించారు. దక్షిణ ఇరాన్‌లోనే ఉన్న సిమెంట్ ప్లాంటుపై కూడా శనివారం దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరూ గాయ పడ లేదని, ప్లాంటు లో కార్యకలాపాలు యధావిధిగా కొన సాగుతున్నా యని హార్మోజ్‌గన్ రాష్ట్ర డిప్యూటీ గవర్నర్ నఫీసి చెప్పారు. కాగా తూర్పు లెబనాన్‌లోని బ్రిడ్జిని ధ్వంసం చేసిన ఇజ్రాయిల్ సైన్యం తాజాగా ఓ ప్రకటన విడుదల చేస్తూ బీరుట్‌లోని హెజ్బొల్లా మౌలిక స్థావరాలపై దాడులు మొదలు పెట్టామని తెలిపింది. ఇజ్రాయిల్ దాడుల కారణంగా బీరుట్‌లో అరగంట వ్యవధిలోనే రెండు భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలుము కున్నాయి. లితానీ నదిపై నిర్మించిన మరో రెండు బ్రిడ్జిలను కూడా కూల్చేస్తామని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరించింది.

**ఆ జలసంధిని కూడా మూసేస్తాం : ఇరాన్ అక్రమ యుద్ధానికి ముగింపు పలకాలన్నదే మా అభిమతం**

ఇరాన్‌లో రెండో వ్యూహాత్మక జలసంధి అయిన బాబ్-ఎల్-మందేబ్‌లో కూడా నౌకల రవాణాను అడ్డుకుంటామని పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఖలీబఫ్ హెచ్చరించారు. 32 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ అదెన్, హిందూ మహా సముద్రంతో కలుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో అత్యంత రద్దీగా ఉండే మార్గాలలో ఇది ఒకటి. సముద్రం ద్వారా సరఫరా అవుతున్న చమురులో పదో వంతు దీని మీదుగానే రవాణా అవుతోంది. నాలుగో వంతు కంటెయినర్ నౌకల రవాణా కూడా దీని ద్వారానే జరుగుతోంది. కాగా సంప్రదింపుల విషయంలో తమ వైఖరిని అమెరికా మీడియా వక్రీకరిస్తోందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆరోపించారు. దౌత్య యత్నాలు జరుపుతున్న పాకిస్తాన్‌కు కృతజ్ఞులమై ఉంటామని, ఇస్లామాబాద్ పర్యటనను తాము ఎన్నడూ నిరాకరించలేదని ఆయన తెలిపారు. తమ దేశంపై రుద్దిన అక్రమ యుద్ధానికి ముగింపు పలకాలన్నదే తమ ఉద్దేశమని, దీనికి సంబంధించిన విధివిధానాలపై తాము దృష్టి పెట్టామని చెప్పారు. ఇదిలావుండగా ఇస్ఫహాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ జరిపిన దాడిలో రెడ్ క్రీసెంట్ సిబ్బంది ఒకరు చనిపోయారని ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలియజేసింది.

**ఇది యుద్ధం కదా : ఎదురు దెబ్బలపై ట్రంప్**

తమ దళాలు చవిచూస్తున్న ఎదురు దెబ్బలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తేలికగా తీసుకుంటున్నారు. ఇరాన్‌తో జరుపుతున్న చర్చలపై వీటి ప్రభావం ఉంటుందా అని విలేకరులు ప్రశ్నించగా 'లేదు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇది యుద్ధం' అని చెప్పారు. యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ధృవీకరించినప్పటికీ పెంటగాన్ కానీ, సెంట్రల్ కమాండ్ కానీ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఇరాన్ గగనతలంపై అమెరికా దళాలు పూర్తి పట్టు సాధించాయంటూ ట్రంప్ గతంలో చేసిన వాదనలో ఏ మాత్రం పస లేదని తాజా ఘటనలు నిరూపించాయి. అమెరికాకు చెందిన గగనతల రక్షణ వ్యవస్థలు నిర్వీర్యమవడం ఆందోళన కలిగిస్తోందని సైనిక నిపుణులు అభిప్రాయపడ్డారు.

**సడలని ఉద్రిక్తత**

ఘర్షణలు రోజురోజుకూ ఉధృతమవుతున్న నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత ఏ మాత్రం సడలే పరిస్థితి కన్పించడం లేదు. ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో తిరిగి చర్చలు ప్రారంభించే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో పాకిస్తాన్ నేతృత్వంలో జరుగుతున్న కాల్పుల విరమణ ప్రయత్నాలు నిలిచిపోయాయి. యుద్ధానికి 48 గంటల పాటు విరామం ఇద్దామంటూ ట్రంప్ చేసిన తాజా ప్రతిపా దనను కూడా ఇరాన్ తోసిపుచ్చింది. ఇజ్రాయిల్-అమెరికా సేనలను, గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులను ముమ్మరం చేస్తోంది. కువైట్‌లోని ఇంధన కేంద్రాలు సహా కీలక మౌలిక సదుపాయాలను దెబ్బతీస్తోంది. చమురు సరఫరాలకు దీర్ఘకాల ఆటంకం ఏర్పడవచ్చునన్న అనుమానాల మధ్య వాటి ధరలు ఆకాశాన్ని తాకుతు న్నాయి. దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా పడుతోంది. అమెరికా యుద్ధ విమానాల కూల్చివేత, ఆచూకీ తెలియకుండా పోయిన పైలట్ కోసం జరుగుతున్న గాలింపు చర్యలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి.

**గల్ఫ్‌పై భీకర దాడులు**

ఇరాన్ దాడులతో గల్ఫ్ భీతిల్లుతోంది. దుబారులోని పలు భవనాలపై శకలాలు పడిన తర్వాత గల్ఫ్ దేశాలలో ఉద్రిక్తతలు పెరిగాయి. బహ్రెయిన్‌లో సైరన్లు మోగించారు. సౌదీ అరేబియాలో పౌర రక్షణ హెచ్చరికలు జారీ చేశారు. విద్యుత్ ప్లాంట్లు, రిఫైనరీలు సహా కీలక మౌలిక స్థావరాలపై ఇరాన్ దాడులు జరుపుతోంది. హార్ముజ్ జలసంధిపై సమర్థవంతమైన నియంత్రణ సాధించిన ఇరాన్...వేలాది నౌకల రవాణాను అడ్డుకుంటోంది. దీంతో పలు దేశాలు కాళ్లబేరానికి వస్తున్నాయి. నిత్యావసరాలను, మానవతావాద సాయాన్ని రవాణా చేస్తున్న నౌకలను ఇరాన్ అధికారులు అనుమతిస్తున్నారు.

**అమెరికా -- ఇజ్రాయిల్ ఇరాన్ అణు విద్యుత్ కేంద్రంపై దాడి**

అమెరికా -- ఇజ్రాయిల్ ఇరాన్‌పై క్షిపణి దాడికి పాల్పడింది. శనివారం దక్షిణ ఇరాన్‌లోని బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో అమెరికా -- ఇజ్రాయిల్ క్షిపణి దాడికి పాల్పడింది. ఈ దాడి ఘటనలో ఒక భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ వెల్లడించింది. ఈ దాడి వల్ల ప్లాంట్‌లోని ప్రధాన భాగాలకు నష్టం జరగలేదు. కానీ ఈ ప్లాంట్ సహాయ భవనం దెబ్బతింది అని మీడియా వెల్లడించింది. ఈ దాడికి ముందు ఇరాన్‌లోని నైరుతి ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని మహ్‌షహర్ పెట్రో కెమికల్ జోన్లపై అమెరికా -- ఇజ్రాయిల్‌లు వైమానిక దాడికి చేయగా.. ఐదుగురు గాయలపాలయ్యారు.

**భారత్‌కు మరింత ఊరట**

**హార్ముజ్ దాటిన ఏడో ఎల్పీజీ నౌక**

ఇంధన సరఫరాల విషయంలో భారత్‌కు మరింత ఊరట లభించింది. మన దేశానికి చెందిన పతాకంతో ఏడో ఎల్పీజీ నౌక 'గ్రీన్ సాన్వీ' హార్ముజ్ జలసంధిని దాటింది. అయితే ఇప్పటికీ 17 నౌకలు ఇరాన్ అనుమతి కోసం హార్ముజ్‌లో ఎదురు చూస్తున్నాయి. కాగా పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ ఓడరేవుల వెలుపల కొన్ని నౌకలు అనుమతి కోసం ఎదురు చూస్తున్నాయని తెలుస్తోంది. అనుమతి పొందడానికి ఈ నౌకలకు కొన్ని వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతాపరమైన సమస్యలే దీనికి కారణం. నిలిచిపోయిన నౌకలకు ఎప్పుడు అనుమతి లభిస్తుందనే విషయంలో అనిశ్చితి కొనసాగుతోంది.

**సమయం మించిపోతోంది**

**48 గంటలే మిగిలింది.. : ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. వారితో ఒప్పందం చేసుకోవడానికి, హార్ముజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్‌కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గర పడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించి నట్టు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.

**చర్చలను తిరస్కరించలేదు..**

మరోవైపు, పాకిస్తాన్‌లో చర్చలను తాము ఎన్నడూ తిరస్కరించలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి స్పష్టం చేశారు. ఈ విషయంలో టెహ్రాన్ వైఖరిని అమెరికన్ మీడియా తప్పుగా చిత్రీకరిస్తోందని ఆరోపించారు. అయితే, ఎటువంటి చర్చలైనా.. యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేలా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా షరతులు పెడుతుండటమే ఆందోళన కర అంశమని అబ్బాస్ అరాగ్చి స్పష్టం చేశారు.

# 'రాజధాని' మరింత వేగం

(మొదటిపేజీ తరువాయి)

అవసరం లేదని అన్నారు. ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు రాగా.. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సిఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలొస్తున్నాయని, ఘటన జరిగిన తర్వాత సంస్థలు, అధికారులు తగిన రీతిలో స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని, ఇలాంటి పరిస్థి తుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**మ్యాన్ పవర్ కొరత ఉందన్న కాంట్రాక్టర్లు**

పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టు సంస్థల తీరుపట్ల సిఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేయడంతో మ్యాన్‌పవర్ విషయంలో కొన్ని ఇబ్బం దులున్నాయని సిఎం దృష్టికి కాంట్రాక్టర్లు తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల దృష్ట్యా చాలామంది కార్మికులు అక్కడకు వెళ్లారని వివరించారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్‌పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి విని యోగించు కోవాలని సిఎం సూచించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నారని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి నారాయణ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కె సురేష్‌కుమార్, సిఆర్‌డిఎ కమిషనరు విజరు రామరాజు పాల్గొన్నారు.

# ఏళ్ల తరబడి కాంట్రాక్టు సేవలు దోపిడీయే

(మొదటిపేజీ తరువాయి)

పనులు చేయించుకోవడమే ఇందుకు కారణమంది. దశాబ్దాలుగా తాత్కాలికం పేరుతో ఉద్యోగుల సేవలను వినియోగించుకోవడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రభుత్వం శ్రమ దోపిడీకి ఆస్కారం ఇవ్వరాదని, రాజ్యాంగబద్ధంగా, ఆదర్శవంతంగా ప్రభుత్వం వ్యవహరించాలని చెప్పింది. వేర్వేరు శాఖల్లో తాత్కాలిక ప్రాతిపదికపై ఏళ్ల తరబడి ఉద్యోగుల సేవల్ని వినియోగించుకోవడం దోపిడీ కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో టైపిస్టులు, ట్రేసర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, వాచ్‌మెన్లు, గార్డెనర్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లుగా దశాబ్దాలుగా చేస్తున్నప్పటికీ సర్వీసులను క్రమబద్ధీకరణ చేయడం లేదంటూ కె శ్రీనివాస్ సహా 37 మంది 2018లో ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. ఇదే తరహాలో తెలుగు గంగ ప్రాజెక్టులో చేసే కె నారాయణరెడ్డి, టిఎస్ ఖాజామైనుద్దీన్లు వేసిన కేసులను ట్రిబ్యునల్ కొట్టివేయడంతో వారంతా హైకోర్టులో సవాల్ చేశారు. వీటిపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేందు శమంతో కూడిన డివిజన్ బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పిటిషనర్ల సర్వీసులను 2 మసాల్లోగా రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను శాశ్వత ప్రాతిపదికపై ఎంపిక చేయకపోవడం వల్ల అర్హులైన ప్రతిభావంతులైన విద్యావంతులు అవుట్‌సోర్సింగ్ ద్వారా కాంట్రాక్టు పద్ధతుల్లో తక్కువ జీతాలకే సేవలు అందించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసింది. తమ సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని వారు కోరితే.. అసలు నియామక ప్రక్రియే సరిగ్గా లేదని ప్రభుత్వం సాంకేతిక కారణాలను సాకుగా చూపి తప్పించుకుంటోందని ఆక్షేపించింది. దశాబ్దాల తరబడి కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో మార్పులు కనబడటం లేదంది. పిటిషనర్లు 1987, 1989లో ఎన్‌ఎంఆర్‌లుగా విధుల్లో చేరారని, 1993 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేయలేదనే ఒక్క కారణంతో వాళ్ల సర్వీసులను క్రమబద్ధీకరణ చేయకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా రోజంతా సేవ అందిస్తూ సమాన వేతనం పొందలేకపోతున్నారని, ఉద్యోగాలను క్రమబద్ధీకరణ కాలేకపోతున్నారని చెప్పింది. ప్రభుత్వం పర్మినెంట్ చేస్తుందనే ఆశలోనే ఇప్పటి వరకు వేచి ఉన్నారని పేర్కొంది. అన్యాయం కొనసాగుతూనే ఉందని తప్పుబట్టింది. ఇది అధికరణం 21 మేరకు జీవించే హక్కును కాలరాయడమేనని తెలిపింది. దశాబ్దాలుగా కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం చేయడం వల్ల వయోపరిమితి దాటిపోయి కొత్తగా రెగ్యులర్ ఉద్యోగ పరీక్షలు రాసే అర్హతను కూడా కోల్పోయారనే విషయాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఈ విధానం ఏకపక్షం, రాజ్యాంగ వ్యతిరేకం. చట్ట విరుద్ధం' అని తేల్చుతూ కీలక తీర్పు వెలువరించింది.

# సంపాదకీయం




## రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు.




ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు.చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు.ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది.ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు.యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు?నిపుణులు ఏమంటున్నారు?ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవుసామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి.లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి.వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది.ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు.భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది.కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు."యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్."ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు."చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు."మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు"లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి.ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు.యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.

# ఎవరి ట్రాప్‌లో ఎవరు...

**విజయవాడ-సూర్య వాస్తవం:** అమరావతి రాజధాని ఎపిసోడ్ లో అధికార టీడీపీ విపక్ష వైసీపీ ఇద్దరూ ఢీ కొడుతున్నారు. ఎవరి ఆలోచనలు వారివిగా ఉన్నాయి. అమరావతి అసాధ్యం అని వైసీపీ అంటూంటే భవిష్యత్తు రాజధాని అని టీడీపీ అంటోంది. ఈ నేపధ్యంలో జగన్ మావిగాన్ పేరుతో ప్లాన్ బీని ప్రకటించారు. ఇక కూటమి అయితే అమరావతి చట్టబద్ధత మీద సంబరాలు చేసుకుంటోంది. వైసీపీని అమరావతి ద్రోహిగా టీడీపీ విమర్శిస్తూంటే వైసీపీ ఏపీకి అమరావతి రాజధాని ఒక అంతులేని కథ యాభై ఏళ్ళు అయినా పూర్తి కాదంటోంది. ఇలా అమరావతి మీద హీటెడ్ డిస్కషన్ తో ఎవరి ట్రాప్ లో ఎవరు పడుతున్నారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. గడచిన మూడు రోజులుగా వైసీపీ మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు దాని కంటే ముందు మార్చి 28న అమరావతికి చట్టబద్ధత కోసం ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా వైసీపీ తీరు మీదనే కూటమి ఎమ్మెల్యేలు మంత్రులు విరుచుకుపడ్డారు. ఈ సమావేశానికి వైసీపీ గైర్ హాజరు అయింది. నిజానికి వైసీపీ వస్తుందని ఒక దశలో అంతా అనుకున్నారు. కానీ అది జరగలేదు. అలా వైసీపీ వ్యూహాత్మకంగా సాగించిన అమరావతి రాజధాని ఎపిసోడ్ లో తనదైన ఎత్తుగడలు పార్లమెంట్ సాక్షిగా పదును తేరాయి. దాంతో టీడీపీకి ఇది ఇబ్బందికరంగా మారిందా అన్న చర్చ వస్తోంది. ఏపీలో రెండు పార్టీలు దశాబ్దాల రాజకీయ వైరం అన్నది అయిదు కోట్ల మంది ప్రజలకు తెలిసిందే. కానీ దేశమంతా చూసే పార్లమెంట్ లో వైసీపీ వ్యవహరించిన తీరు అయితే టీడీపీని ఇబ్బంది పెట్టిందనే అంటున్నారు. మొత్తం యాభై పార్టీలు కలసి అమరావతి రాజధానికి మద్దతుగా నిలిస్తే వైసీపీ మాత్రం వ్యతిరేకించి వాకౌట్ చేసింది. పైగా ఏపీకి చెందిన ఒక పార్టీ అమరావతి రాజధాని విషయంలో తాము ససేమిరా మద్దతు ఇవ్వమని అక్కడ రైతులకు అన్యాయం జరుగుతోంది అంటూ ఎలుగెత్తి చాటింది. అయితే బిల్లు పాస్ అయింది కానీ ఈ విషయం అయితే చర్చకు జాతీయ స్థాయిలోనూ వచ్చింది.




ఇదే ఇపుడు టీడీపీని మరింతగా ఇరిటేట్ చేస్తోందా అన్నదే చర్చ. బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ మీద నిప్పులు చెరిగారు. ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని చంద్రబాబు చెప్పుకొచ్చారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని ఆయన వ్యాఖ్యానించారు. కొందరికి రాష్ట్రం గురించి తెలియదని రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్ట బద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి, అనుకూలంగా ఓటేశాయని బాబు గుర్తు చేశారు. ఏపీలో ఓట్లు పొంది ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారని బాబు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారని అన్నారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే వైసీపీ మాత్రం మరో వైపు నిలిచిందని బాబు విమర్శించారు. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో వైసీపీ ఆలోచిస్తోందని బాబు ఫైర్ అయ్యారు.

**కుట్రలు..కుతంత్రాలు :** అమరావతి రాజధాని విషయంలో వైసీపీ చాలా డ్రామాలు ఆడిందని బాబు విమర్శించారు. అమరావతి మీద వైసీపీ వారు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. తుగ్లక్ లు కొత్తగా పాలనలోకి వచ్చి రాజధానిని ప్రతీసారీ మారుస్తామంటే ఎలా అని బాబు ప్రశ్నించరు. దీనికి అర్థం ఉంటుందా అని నిలదీశారు. శాశ్వత రాజధాని అని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని మాట్లాడతారా అని జగన్ మీద గుస్సా అయ్యారు. ఇదేం రాజకీయమని అంటూనే ఇలాంటి నాయకులు ఉండటం రాష్ట్ర దౌర్భాగ్యం అని బాబు అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవహేళన చేసి మాట్లాడతారా అని ఆయన ప్రశ్నించారు. ఏకంగా ప్రజలకు, ప్రజాధనానికి నష్టం జరిగేలా వ్యవహరిస్తారా అని బాబు గద్దించారు. ప్రజలకు సంక్షేమం, జీవన ప్రమాణాలను కల్పించటంపైనే ఎవరైనా మాట్లాడుకోవాలి కానీ ఇలాంటి వారి పట్ల మాట్లాడటం కూడా అనవసరమని బాబు చివరికి అభిప్రాయపడ్డారు.

**సవాల్ గా తీసుకోవాల్సిందే :** అమరావతి రాజధాని విషయంలో వైసీపీ వ్యతిరేకించింది అన్నది టీడీపీ అభిప్రాయంగా ఉంది. అయితే వైసీపీ తన స్టాండ్ చెప్పేసింది, ఆ మీదట ప్రజలు ఆ పార్టీ విషయంలో నిర్ణయించుకుంటారు. వైసీపీ అమరావతి నిర్మాణం అసాధ్యం అని అంటోంది. దానిని సవాల్ గా తీసుకుని టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేయాలి, వైసీపీని విమర్శిస్తూ కూర్చుంటే వారి వ్యూహంలోనే చిక్కుకున్నట్లు అవుతుందని అంటున్నారు. ఈ రోజున అయితే వైసీపీ మాటలను పక్కన పెట్టి మరీ అయిదు కోట్ల మంది ప్రజలు కూటమి వైపు చూస్తున్నారు. మరి కూటమి అమరావతికి ఒక రూపూ షేపూ తేవడం మీదనే అందరి భవిష్యత్తు ఆధారపడి ఉందన్నది మరవరాదు అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# మైనార్టీలే గెలుపు డిసైడ్...

**తిరువనంతపురం-సూర్య వాస్తవం:** కేరళ జనాభాలో ముస్లింలు సుమారు 26 శాతం, క్రైస్తవులు సుమారు 18 శాతం... కలిపి దాదాపు 45 శాతం పైగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు తరచుగా హిందూ-ముస్లిం ధ్రువీకరణ చుట్టూ తిరుగుతుంటే, కేరళలో మాత్రం ఈ రెండు మైనారిటీ వర్గాల మొగ్గు ఎటువైపు ఉంటే ఆ కూటమి అధికార పీఠాన్ని అధిరోహిస్తుంది. దశాబ్దాలుగా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ కు ఈ వర్గాలే కొండంత అండగా ఉంటూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలు కాంగ్రెస్ కూటమిలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లు గంపగుత్తగా యూడీఎఫ్‌కే పడేవి.ఉత్తర కేరళలోని మలప్పురం , వయనాడ్ జిల్లాలు మైనారిటీ రాజకీయాలకు కేంద్రబిందువులు. మలప్పురంలో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఇక్కడ ముస్లిం లీగ్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. అలాగే వయనాడ్ వంటి చోట్ల ముస్లిం, క్రైస్తవ ఓటర్ల కలయిక అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. ఈ జిల్లాల్లో మెజారిటీ స్థానాలను సాధించకుండా ఏ కూటమి కూడా తిరువనంతపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం కూడా ఈ మైనారిటీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసిన వ్యూహమే. ప్రస్తుతం ప్రియాంకాగాంధీ వయనాడ్ ఎంపీగా ఉన్నారు. గతంలో మైనారిటీ ఓట్లు కేవలం కాంగ్రెస్ సొత్తని భావించేవారు, కానీ ఇటీవలి కాలంలో ఎల్డీఎఫ్ ఈ కోటలోకి చొచ్చుకెళ్లింది. మతతత్వ శక్తులను అడ్డుకోగల ఏకైక శక్తి కమ్యూనిస్టులేననే ప్రచారంతో ముస్లిం యువతను ఎల్డీఎఫ్ ఆకట్టుకుంది. అలాగే కేరళ కాంగ్రెస్ ఎం వంటి క్రైస్తవ ప్రాధాన్యత గల పార్టీని తమ కూటమిలోకి చేర్చుకోవడం ద్వారా మధ్య కేరళలోని క్రైస్తవ ఓటు బ్యాంకులో ఎల్డీఎఫ్ పట్టు సాధించింది. 2021లో ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి గెలవడానికి ఈ మైనారిటీ ఓట్ల చీలిక , మళ్లింపు ప్రధాన కారణం.ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నెముకలా ఉన్న క్రైస్తవ ఓటర్లలో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. చర్చిల్లో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు వారి ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తున్నాయి. జేకోబైట్ చర్చి వంటి వర్గాలు ఎల్డీఎఫ్‌కు మద్దతు తెలపడం యూడీఎఫ్‌కు గట్టి దెబ్బ. అదే సమయంలో, బీజేపీ కూడా క్రైస్తవ నాయకులతో మంతనాలు జరుపుతూ వారిని తమ వైపు తిప్పుకోవడానికి మైనారిటీల మధ్య అసమానతలు వంటి అంశాలను వాడుకుంటోంది.కేరళలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, మైనారిటీల ప్రయోజనాలను విస్మరించడం సాధ్యం కాదు. విద్యా సంస్థలు, మతపరమైన హక్కులు , సంక్షేమ పథకాల కేటాయింపులో ఈ వర్గాలకు ఇచ్చే ప్రాధాన్యతపైనే ఆయా పార్టీల మనుగడ ఆధారపడి ఉంటుంది. ముస్లిం లీగ్ వంటి పార్టీలు యూడీఎఫ్‌లో కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తుంటే, ఎల్డీఎఫ్ తనదైన సోషల్ ఇంజనీరింగ్ ద్వారా మైనారిటీ మద్దతును కూడగడుతోంది. కేరళలో మైనారిటీ ఓటు అనేది కేవలం ఒక సంఖ్య కాదు, అది ఆ రాష్ట్ర రాజకీయ సుస్థిరతను నిర్దేశించే ఒక బలమైన శక్తి. రాబోయే ఎన్నికల్లో కూడా మలప్పురం నుండి కొట్టాయం వరకు ఈ వర్గాల మనసు గెలుచుకున్న వారే కేరళ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తారు.



# బెర్త్ కోసం వ్యూహాలు

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారులో మార్పులు జరుగుతాయనే అంశంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వ్యూహాలను విశ్లేషిస్తే, ఈ విస్తరణ అంశం ఎందుకు ఆసక్తికరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి, ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ ఖాళీలను భర్తీ చేస్తారని, మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అందరూ భావించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, తాజా పరిణామాల దృష్ట్యా ఈ విస్తరణ ప్రస్తుతానికి వాయిదా పడినట్లు తెలుస్తోంది.మంత్రివర్గ విస్తరణ వాయిదా పడటానికి ప్రధాన కారణం ఐదు రాష్ట్రాల ఎన్నికలేనని సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ముఖ్యంగా కేరళలో అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం, అక్కడ ప్రచారంలో నిమగ్నమైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు కూడా కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఈ కీలక సమయంలో మంత్రివర్గ విస్తరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ దృష్టి మళ్లుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.కేవలం రెండు ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరును బేరీజు వేసి, అవసరమైతే ఒకరిద్దరిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. అయితే, ఈ మార్పుల వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు లేదా అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్త పడాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.విస్తరణ వార్తలతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పదవి దక్కుతుందని ఆశపడ్డ నాయకులు విస్తరణ వాయిదా పడటంతో కొంత నిరాశకు గురైనప్పటికీ, తమ ప్రయత్నాలను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. కొందరిలో రిలాక్స్ కనిపిస్తుంటే, మరికొందరిలో టెన్షన్ పెరుగుతోంది.



ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో కేబినెట్ విస్తరణపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మొత్తానికి, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎన్నికల వ్యూహాలతో ముడిపడి ఉంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందడి ముగిసిన తర్వాతే రేవంత్ రెడ్డి తన టీమ్ లో ఎవరికి చోటు కల్పిస్తారు, ఎవరిని మారుస్తారనేది స్పష్టమవుతుంది. అప్పటి వరకు ఆశావహులు వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

## తహశీల్దార్‌గా మోహన్ కృష్ణ బాధ్యతల స్వీకరణ



**వేంపల్లె-సూర్య వాస్తవం:** వేంపల్లి మండలం నూతన తహసిల్దారుగా పి. మోహన్ కృష్ణ శనివారంబాధ్యతలు స్వీకరించారు. గతంలో నందలూరులో డిప్యూటీ తహసిల్దార్ పని చేసిన ఆయన, పదోన్నతి పై వేంపల్లికి బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి, ప్రజలకు తన వంతు మెరుగైన సేవలందిస్తానని పేర్కొన్నారు.

## వడదెబ్బ ప్రాణాంతకం

### - ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



**అనంతపురం-సూర్య వాస్తవం:** ఎండలు విపరీతంగా ఉన్నాయని, వడదెబ్బకు గురైతే ప్రాణాంతకమని, అత్యవసరమైతే తప్ప అనవసరంగా ఎవరూ బయట తిరగొద్దని ఐసీడీఎస్ పీడీ ఎం.శ్రీదేవి అన్నారు. అనంతపురం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇందిరాగాంధీ నగర్ -1,2 అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎండలో తిరిగితే తగిలే వడదెబ్బ ప్రమాదం, వడదెబ్బకు గురైతే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అసలు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి పీడీ వివరించారు. ఎండలు భయంకరంగా ఉన్నాయని, బయటకు రాకపోవడమే మంచిదన్నారు. ఒకవేళ అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే శ్రేయస్కరమని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు మరీ జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నీళ్లు, మజ్జిగా, చల్లని పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. రోజుకు కనీసం రెండుసార్లు స్నానం చేయాలని సూచించారు. మసాలా పదార్థాలు, మాంసాహారం తీసుకోకపోవడమే మంచిదని వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మ, అర్బన్ సీడీపీఓ అనూరాధ, సూపర్ వైజర్ కురుబ హేమలత, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం కేంద్రంలోని పిల్లల ఎత్తు, బరువు, కొలతలు చూసారు. రికార్డులు పరిశీలించారు. కేంద్రాల పరిసరాలు చేశారు. సూపర్ వైజర్ కురుబ హేమలత, వర్కర్ల పని తీరును అభినందించారు.

## కుంచా నారాయణకు శ్రద్ధాంజలి ఘటించిన తులసిరెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లి సంఘం వీధికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కుంచా వెంకటనారాయణ శనివారం వార్ధక్యంతో, అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉత్తన్న నారాయణ భౌతిక కాయానికి పుష్పాంజలి, శ్రద్ధాంజలి ఘటించారు.నారాయణ పవిత్ర ఆత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఎస్ఐ నాగ మధుకు

## చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ కమిటీ కృతజ్ఞతలు




**కనేకల్- సూర్య వాస్తవం:** కనేకల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ చిక్కణ్ణేశ్వరస్వామి వారి వార్షిక మహారథోత్సవం భక్తుల అపార విశ్వాసం, ఉత్సాహం నడుమ అత్యంత ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగుతూ భక్తిశ్రద్ధలతో సేవలందించారు. ఉత్సవం సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తి పారవశ్యం కనిపించింది.ఈ మహోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పటిష్టమైన బందోబస్తు నిర్వహించింది. రథోత్సవ మార్గమంతా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, జనసంచారం నిర్వహణలో పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించారు. ముఖ్యంగా భారీగా తరలి వచ్చిన భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో వారి పాత్ర ప్రశంసనీయం.అలాగే అత్యవసర సేవలు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక దళం కూడా అప్రమత్తంగా విధులు నిర్వహించి భక్తులకు అవసరమైన సహాయాన్ని అందించారు. స్థానిక ప్రజలు, సేవా సంఘాలు కూడా పోలీస్ శాఖకు సహకరించి కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడ్డారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎస్సై నాగమధు కు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రత కోసం వారు చేసిన కృషి అభినందనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం అందించాలని కోరారు.

### ప్రజల సమస్యల పరిష్కారానికి

# ప్రజా దర్బార్

**ఒకే వేదికపై ప్రభుత్వ శాఖల అధికారులు**
**- సమస్యల పరిష్కారానికి హామీ**

**సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం**
**ప్రజల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే**

**పెళ్లకూరు-సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి సత్వర పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతిపత్రాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం తదితర ప్రభుత్వ శాఖల అధికారులను ఒకే వేదికపై అందుబాటులో ఉంచారు. ప్రజలు ఇచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సూచిస్తూ పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు ఎల్లప్పుడూ స్పందనతో పనిచేయాలని సూచించారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తమతో పాటు ఉంటానని ఆమె తెలిపారు.ప్రజా దర్బార్ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించడంతో ప్రభుత్వం స్పందన చూపుతున్నదని సంతోషం వ్యక్తం చేశారు.





### తిరుమల పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

### బిఆర్ నాయుడు లాంటి వ్యక్తుల వల్ల

# ఆలయ ప్రతిష్టకు భంగం





**పులివెందుల సూర్య వాస్తవం:** హిందువుల ఆరాధ్య దైవం, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పవిత్రమైన టీటీడీ ఛైర్మన్ పదవిలో బి.ఆర్.నాయుడు వంటి వ్యక్తులు ఉండటం వల్ల ఆలయ ప్రతిష్టకు భంగం కలిగే ప్రమాదం ఉన్నదని ఆయనను వెను వెంటనే ఆ పదవి నుండి తొలగించి,తిరుమల పవిత్రతను కాపాడాలని పులివెందులలో వైకాపా నేతల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలలో భాగంగా పులివెందులలో టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు వ్యవహార శైలిపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బి.ఆర్. నాయుడు తొలగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పులివెందుల "శ్రీ వెంకటేశ్వర స్వామి" ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి, 101 టెంకాయలు కొట్టి, బి ఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నాడని ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు అదేవిధంగాబిఆర్ నాయుడు ను టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి టిటిడి పవిత్రతను కాపాడాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, కోడి రమణ, కోళ్ల భాస్కర్, రాజశేఖర్, దాసరి చంద్రమౌళి, ఓ రసూల్, టెంకాయల శీను మరియు లింగాల మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి భాస్కర్ రెడ్డి నరసింహారెడ్డి బ్యాటరీ ప్రసాద్ మరియు ఇతర వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



#### పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్

## ఈఈగా ఆవుల లోకన్న

**- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభినందనలు**

**అనంతపురం - సూర్య వాస్తవం:** పంచాయతీ రాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటిక్ ఇంజినీర్ (ఈఈ)గా ఆవుల లోకన్న నియమి తులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ రెగ్యులర్ ఈఈగా పని చేసిన మల్లికార్జున నెల రోజుల పాటు సెలవులో వెళ్ళడంతో సబ్ డివిజన్-1 డీఈఈగా ఉన్న లోకన్నకు పూర్తి అదనపు బాధ్యతలతో ఈఈగా నియమించారు. ఎఫ్.ఏ.సీ హోదాలో బాధ్యతలు చేపట్టిన లోకన్నను ఆ శాఖ డీఈఈలు రవీంద్ర (రిటైర్డ్), గోపాల్ నాయక్, ఏఈఈలు సంగీత, భాస్కర్, ఓబులదాస్, కదిరి డీ ఈ హనుమంతయ్య, ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, ఇతర సభ్యులు కూడా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

#### పార్లమెంటులో శాశ్వత రాజధాని

## ఆమోదం సంతోషకరం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ శాశ్విత రాజధానిగా అమరావతిని పార్లమెంటు ఆమోదించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు నేడు పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బప్రధానో పాధ్యాయులు శ్రీ.జె. నాగాంజనే యులు, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ శ్రీనివాస్ చెరుకూరు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సి. ఆర్. పి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## సితార హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణంలోని హరినాథ్ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సితార హాస్పిటల్ ను (ఆర్థో, స్పైన్,మెటర్నిటీ క్లినిక్) శనివారం ప్రారంభోత్సవమయింది. వీరభద్ర స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మీ ప్రసాద్ ఆహ్వానం మేరకు ఈ ప్రారంభోత్సవానికి పిసిసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ షేక్. అల్లాబక ష్ ( సీఎల్పీ) వివిధ పార్టీల రాజకీయ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఒకే ప్రాంగణంలో లభించడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారు అన్నారు. వైద్య వృత్తి అనేది పరమ పవిత్రమైనదని, డాక్టర్ పగడాల మణికంఠ బాబు, డాక్టర్ భవ్య లు మానవీయ కోణంలో రోగులకు సేవలు అందించి సితార హాస్పిటల్‌ను ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్లకు ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బస్సు ఢీకొని బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్



**వేంపల్లె-సూర్య వాస్తవం:** వి. కొత్తపల్లి సమీపంలో శనివారం సాయంత్రం ఓ ట్రాక్టర్ ను ఆర్టీసీ బస్సు వెనక వైపు నుంచి వచ్చి ఢీకొనగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. వేంపల్లి నుంచి వస్తున్నా ఇసుకలోడు గల ట్రాక్టర్ను, కడప నుంచి పులివెందుల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ 2 ముక్కలై రోడ్డు పక్కనపడిపోయినప్పటికీ, అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణ పాయం జరగలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వడదెబ్బ నుంచి రక్షణపై అవగాహన



**అనంతపురం- సూర్య వాస్తవం:** అనంతపురం రాణి నగర్-4, వినాయక్ నగర్-2 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, మహిళల పోలీస్ మాధవీలత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వడదెబ్బ బారి నుంచి ఎలా బయటపడాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై చైతన్యం కల్పిస్తూ ర్యాలీ కొనసాగింది. ఆయా కేంద్రాల అంగన్వాడీ వర్కర్లు లక్ష్మీనరసమ్మ, సత్యవతి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకున్న
## కూటమి నాయకులు

**వేంపల్లె - సూర్య వాస్తవం:** పార్లమెంట్లో అమరావతి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడం పై వేంపల్లి లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్డీఏ కూటమి నేతలు దీపాలు వెలిగించి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి. హరిప్రసాద్, జనసేన పార్టీ కడప జిల్లా నాయకులు జి. వి. రమణ, పులివెందుల నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ హరీష్, చొక్కాం. మల్లికార్జున, దేవా తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం తహాశీల్దార్‌గా
## అనురాధ బాధ్యతలు

**సింహాద్రిపురం- సూర్యవాస్తవం:** సింహాద్రి పురం మండలం నూతన తహసిల్దారుగా



బి అనురాధ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో డిఎం సివిల్ సప్లై నుండి పదోన్నతి పై సింహాద్రి పురం తాసిల్దారుగా బదిలీ కావడం జరిగిందని,ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కార్యాల య సిబ్బంది ఘన స్వాగతం పలుకగా, మండల అభివృద్ధికి, ప్రజలకు తన వంతు మెరుగైన సేవలందిస్తానని ఆమె పేర్కొన్నారు.

జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా
## డి .శ్రీనివాసులు ఎన్నిక

**కదిరి - సూర్య వాస్తవం:** ఈ సత్యసాయి జిల్లా లోని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కూడిన ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా



ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు శనివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు, గతంలో కూడా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు, 12వ పిఆర్సి సాధన లక్ష్యంగా మరిన్ని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రం కోసం రాబోయే కాలంలో ఉద్యమాల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటా మని తెలిపారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్, యుటిఎఫ్ కదిరి జోన్ నాయకులు తాహిర్ వలి, మల్లికార్జున, వి వర్ధన్ రెడ్డి, సునీల్ కుమార్, ఆజం భాష, మధు, సంతోష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి గారూ! రాజధానికి చట్టబద్ధత సరే
# మరి ఇప్పటికే చట్టంలో ఉన్న అంశాల మాటేమిటి?

## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె-సూర్య వాస్తవం:** రాష్ట్ర రాజధాని అమరావతికి పార్లమెంటు చట్టం ద్వారా చట్టబద్ధత కల్పించడం హర్షణీయమైనప్పటికీ ఇప్పటికే చట్టంలో పొందుపరిచి 11 సంవత్సరాలు అయినా అమలుకాని అంశాల మాటేమిటి అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధానిలో రాజ్ భవన్,రాష్ట్ర సచివాలయం, హైకోర్టు, శాసనసభ, శాసనమండలి భవనాలు,ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 85 సబ్ సెక్షన్ 2 ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన 60 రోజు లోపల కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది.11 సంవత్సరాలు అయినా ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్డ్ ప్రకారము కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కావాలి . దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవు ఏర్పాటు కావాలి. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి చట్ట ప్రకారము మన రాష్ట్రానికి రావాల్సిన పైన పేర్కొన్న అంశాలను సాధించాలని తులసి రెడ్డి ముఖ్యమంత్రి సూచించారు. పైన పేర్కొన్న వాటితో పాటు ఆంధ్రప్రదేశ్ కు సంజీవని లాంటి ప్రత్యేక హోదా సాధించేందుకు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఫ్రీ జోన్**

రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యా ఉద్యోగాలకు సంబంధించి, స్థానిక స్థానికేతర అంశాలకు సంబంధించి రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించడం జరిగింది . అందులో రాజధాని ప్రాంతం మూడవ జోన్ పరిధిలోకి వస్తుంది. రాజధాని ప్రాంతంలో విద్యా ఉద్యోగాలలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఆ అవకాశాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి లభించేటందుకు గాను రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తులసి రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాదును ఫ్రీ జోన్ గా ప్రకటించినట్లే నవ్యాంధ్రప్రదేశ్లో రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే అండ దండలతో
# పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశాం

- గతంలో కన్నా మెరుగ్గా గ్రామపంచాయతీ

## సర్పంచ్, ఉప సర్పంచ్ సభ్యుల వీడ్కోలు సభలో పుత్తా వేణు గోపాల్ రెడ్డి



**చెన్నూరు - సూర్య వాస్తవం:** ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అండదండలతో సర్పంచ్ వార్డు సభ్యులు అధికారుల సహాయసకారాలతో రామనపల్లె గ్రామ పంచాయతీ అభివృద్దే ధ్యేయంగా తామంతా కృషి చేయడం జరిగిందని ఎన్నో ఏళ్లుగా నోచుకోనటువంటి దీర్ఘకాలికమైనటువంటి పనులను ఎంతో సమర్థవంతంగా పూర్తి చేసి రామనపల్లె గ్రామపంచాయతీ ప్రజల కలలను నెరవేర్చడం జరిగిందని ఉప సర్పంచ్ పుత్త వేణుగోపాల్ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు. శనివారం రామనపల్లె గ్రామపంచాయతీ నందు నిర్వహించిన సర్పంచ్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ, రామనపల్లె గ్రామ ప్రజలు తమను నమ్మి తమకు ప్రజా ప్రతినిధులుగా అవకాశం కల్పించడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి మా వంతు కృషి చేశామని ప్రభుత్వ నిధులే కాకుండా, సొంత నిధులు కూడా వెచ్చించి అభివృద్ధికి బాటలు వేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాచినాయపల్లె, రామనపల్లె రోడ్డు మరింత అద్వానంగా మారి, అటు రైతులకు, ఇటు బాటసారులకు ఎన్నో ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరగడం జరిగిందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఆ రోడ్డును పూర్తి చేయడం జరిగిందని ఆయన అన్నారు. అంతేకాకుండా కడప- కర్నూల్ జాతీయ రహదారి చిన్న మాచుపల్లి నుండి రామనపల్లెకు ఉన్నటువంటి మెయిన్ రహదారి గుంతల మయం అయ్యి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఆ రోడ్డును వేయడమే కాకుండా, తమ సొంత నిధులతో చిన్నమాచుపల్లి మెయిన్ రోడ్డు నుండి రామనపల్లె వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు వేయడం జరిగిందన్నారు. గతంలో గ్రామ పంచాయితీ ఈ విధంగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అంతే కాకుండా ప్రజల దహార్తి తీర్చేందుకు బోర్లు పైపులైను ఏర్పాటు చేయించి ప్రజల దాహార్తి తీర్చడం జరిగింది అన్నారు. గ్రామపంచాయతీలో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య లేకుండా చూసామని, గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా, కులాల కతీతంగా, మతాలకతీతంగా అభివృద్దే ధ్యేయంగా పనిచేశామని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అండదండలతో అధికారుల సహాయ సహకారాలతో గ్రామ పంచాయతీ అభివృద్ధి చేసే భాగ్యం కలిగినందుకు, రామనపల్లె ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటామని ఆయన భావోద్వేగంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి గురించి మాట్లాడారు. అనంతరం కార్యదర్శి గురువేశ్వరరావు, రాష్ట్ర మాజీ అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి,లు మాట్లాడుతూ, రామనపల్లె గ్రామపంచాయతీ ప్లాస్టిక్ రహిత పంచాయతీగా, శానిటేషన్ లో క్లీన్ అండ్ గ్రీన్ గా చేసి పంచాయతీగానే కాకుండా (ఎస్ డబ్ల్యూ పిసి)ని అభివృద్ధి చేసి తద్వారా తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి అక్కడే ఎరువులు తయారుచేసి రైతులకు విక్రయించే విధంగా కృషి చేసిన సర్పంచ్ ఉప సర్పంచ్లను వారు గొప్పగా కొనియాడి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ద్వీపం స్వప్నిక, పుత్త మహేంద్రారెడ్డి వార్డు మెంబర్లు వై. సునీల్ కుమార్ రెడ్డి, ఎస్. నరసింహులు, రామయ్య, చల్ల బాల వీరమ్మ, పుత్త వెంకటలక్షుమ్మ, గాలి శిరీష, సచివాలయ సిబ్బంది ప్రశాంత్, వసంత, నిరోషాలు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో అక్రమాలను సహించేది లేదు

**అంగన్వాడీ కేంద్రాల్లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ**



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను శనివారం శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పులివెందుల లోనిఇస్లామపురం 1 ఛ 2 కేంద్రాలతో పాటు జెండామాను వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు.కేంద్రానికి వస్తున్న పిల్లల సంఖ్యకు, హాజరు పట్టికలో నమోదైన వివరాలకు పొంతన ఉందో లేదో ఎమ్మెల్సీ స్వయంగా తనిఖీ చేశారు. గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై లబ్ధిదారులతో మాట్లాడారు.అంగన్వాడీ కేంద్రాల్లో నిల్వ ఉంచిన కోడిగుడ్లను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం కంటే కోడిగుడ్లు చాలా చిన్నవిగా ఉండటంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. “అంగన్వాడీ కేంద్రాలు పేద ప్రజల పిల్లలకు ఆసరాగా ఉండాలి. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలి. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగూట్ల రాఘవరెడ్డి , తాళ్ళపల్లి వెంకటేశ్వర రెడ్డి , జ్ఞానేశ్వర్ నాయుడు శ్రీనివాసులు రెడ్డి మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ

## ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమము

**సింహాద్రిపురం సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండలం నందు భాను కోట శివాలయం నందు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమము భారతీయ జనతా పార్టీ మండల క్రియాశీలక సభ్యులు మండల బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూత్ స్థాయి, స్థానిక ఎన్నికలు, బిజెపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వాటి గురించి వివరించడమైనది. పేదల ఆర్థిక సాధారికత నుండి మహిళల రక్షణ కొరకు, రైతుల ఆర్థిక భద్రతకు, యువతకు నైపుణ్యాలు ఉపాధి అవకాశాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేసి, సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కవిశ్వాసం అనే నినాదంతో ప్రతి కుటుంబము, ప్రతి గ్రామము ప్రతి వర్గము జీవితం లో మార్పు తీసుకురావాలనే సంకల్పముతో కేంద్ర ప్రభుత్వము అనేక పథకాలకు రూపకల్పన చేసింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా బిజెపి అధ్యక్షుడు జి వెంకటసుబ్బారెడ్డి , రాష్ట్ర మార్క్ సైడ్ నెంబర్ మంగళ శశి, భూషణ్ రెడ్డి, కడపబిజెపి కిసాన్ మోర్చా కే లక్ష్మీనారాయణ రెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు గజ్జల అమర్నాథరెడ్డి కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ , కార్యకర్తలు బిజెపి అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయబడినది.

## నీటి సమస్య- కాలనీవాసుల ఇబ్బందులు



**తొండూరు సూర్య వాస్తవం:** తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలోని వైయస్సార్ కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. తాగునీటి సమస్యతో వైఎస్ఆర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇనగలూరు గ్రామపంచాయతీలో ఉన్న రెండు విద్యుత్ మోటార్లు పనిచేయకపోవడంతో నీటి కొరత ఏర్పడింది. ఈ సందర్భంగా కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు తగిన చర్యలు తీసుకొని వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైఎస్ఆర్ కాలనీలో విద్యుత్ మోటార్లు పనిచేసేలా చూసి తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

## రైతులకు రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**తొండూరు సూర్య వాస్తవం :** తొండూరు మండలం ఇనగలూరు గ్రామ సచివాలయంలో శనివారం వీఆర్వో మధు రైతులకు రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాల వల్ల గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. రైతుల పొలాల్లో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యలను రీ సర్వేతో తీరాయన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు సుందరరావు, మత్తయ్య, ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకోసం తమిళనాడువాసి సైకిల్ యాత్ర



**లక్కిరెడ్డి వల్లి -సూర్య వాస్తవం:** పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గాను తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ సైకిల్ యాత్ర సాగిస్తున్నారు. సైకిల్ యాత్రలో భాగంగా శనివారం ఆయన లక్కిరెడ్డిపల్లెకు చేరుకుని స్థానిక అధికారులతో కలిశారు. ఈ సందర్భంగా ముత్తుసెల్వన్ మాట్లాడుతూ కోటి మొక్కలు నాటించాలనే లక్ష్యంతోపాటు పర్యావరణాన్ని పరి రక్షించాలని ఉద్దేశంతో తాను ఐదేళ్ల క్రితం సైకిల్ యాత్ర ప్రారంభించానన్నారు. ఇప్పటివరకు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర సాగించానని, త్వరలోనే ఇతర దేశాల్లో కూడా సైకిలాయాత్ర సాగించడానికి ప్రణాళికలు ఉన్నా యన్నారు. అనంతరం ముత్తు సెల్వన్ స్థానిక పోలీస్ అధికారులతో మర్యాదపూర్వకంగా కలిసి, తాను చేస్తున్న సైకిల్ యాత్ర గురించి వివరించారు. ముత్తు సెల్వన్ను పలువురు అధికారులు, స్థానికులు ఆయనకు అభినందించారు ఈ కార్యక్రమంలో మల్లికార్జున, మనోహర్ రెడ్డి, శివయ్య, అల్తాఫ్, సహదేవ, గంగాధర్, సుధీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చట్టబద్ధ అమరావతి ఉత్సవాలు

**సింహాద్రిపురం సూర్య వాస్తవం:** కడప జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింహాద్రిపురంలో "చట్టబద్ధ అమరావతి ఉత్సవాలు" ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉభయ పార్లమెంటు సభలలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పొందిన సందర్భంగా, శనివారం ఉదయం 9.00 గంటల నుండి 10.30 గంటల వరకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,



ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, అమరావతి రాజధానిగా చట్టబద్ధత పొందడం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమని, దీని ద్వారా రాష్ట్రానికి ఆర్థిక, సామాజిక మరియు మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అమరావతి ప్రాముఖ్యత, దాని వల్ల రాష్ట్ర ప్రజలకు కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ప్రసంగాలు మరియు ఆటపాటల ద్వారా తమ ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, బాధ్యతా భావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించింది. రవీంద్ర, జయప్రకాష్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, శైలశ్రీ, శ్రీలక్ష్మి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా శివ కేశవ్



**ప్యాపిలి-సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలానికి చెందిన యువ నాయకుడు శివ కేశవ్ ను బీజేపీ యువమోర్చా ప్యాపిలి మండల అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు , యువమోర్చా జిల్లా అధ్యక్షులు శిలివేరి వెంకటేష్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పాకుల విజయభాస్కర్, ప్యాపిలి మండల అధ్యక్షులు కే. బి. దామోదర్ నాయుడు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కేసి మద్దిలేటి గార్ల సూచనల మేరకు ఈ నియామకం జరిగినట్లు పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శివ కేశవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా తన వంతు బాధ్యతను నిబద్ధతతో మరియు యువతను బలోపేతం చేస్తూ పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కూడా ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శివ కేశవ్ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## అంజన్నకు విశేష పూజలు

**సింహాద్రిపురం-సూర్య వాస్తవం:** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో



ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో

### అచ్చవెల్లి పాఠశాలలో

## అమరావతి చట్టభద్దత సంబరాలు





**పులివెందుల రూరల్ సూర్య వాస్తవం:** ఉభయ పార్లమెంట్ సభలలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పొందిన సందర్భంగా అచ్చవెల్లి గ్రామం లోని జడ్. పి. హెచ్. ఎస్ మరియు ఎం పి పి ఎస్ పాఠశాల లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తముగా ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర సౌజన్యముతో ఎన్. వెంకటనాయుడు, సి. రాజశేఖర్ రెడ్డి, కె. మధుసూదన్ రెడ్డి ల ఆధ్వర్యంలో అందమైన పూల తో కూడిన రంగవల్లులు వేసి సంబరాలు జరుపుకొన్నారు .ముందుగా ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు మాట్లాడుతూ దేశరాజధాని వేదికగా ఆంధ్రుల చిరకాల స్వప్నం అయిన అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో, రాజ్యసభలో అద్భుతమైన ఘట్టం చోటుచేసుకుందని అమరావతి చట్టబద్ధత బిల్లు ను యావత్ భారతదేశం ముక్తకంఠంతో స్వాగతించిందని తెలియజేశారు. తర్వాత రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర, మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచ స్థాయిలో మౌలిక సదుపాయాలు వేలాది ఉద్యోగ అవకాశాలు, రియల్ ఎస్టేట్ రంగంలో భారీ వృద్ధి, మరియు ఆర్థికపెట్టబడులను ఆకర్షించే అవకాశం ఉందని, మరియు ఇది ఒక పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకొని రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఒక ఇంజిన్ గా పనిచేస్తుందని తెలియజేశారు. తర్వాత సూర్యుడు నాయక్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ కృష్ణా నది ఒడ్డున పర్యావరణహితంగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగానికి ఊరట కలిగిస్తుందని మరియు రాష్ట్రం నడిబొడ్డున రాజధాని ఉండడం వల్ల పరిపాలనా పరమైన నిర్ణయాలు, ప్రజలకు సేవలు వేగంగా అందుతాయని తెలియజేశారు. తర్వాత పాఠశాల లోని విద్యార్థులందరికి స్వీట్స్ మిక్చర్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమం లో వెంకట నాయుడు, రాజశేఖర్ రెడ్డి, అంగడి నాగేంద్ర, సూర్యుడు నాయక్, మధుసూదన్ రెడ్డి, విజయలక్ష్మి, నాగరాజు నాయక్, వళ్ళిసాహెబ్, జార్జ్, బాలయ్య, శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



### వీధు దీపాలు వెలగక నగరిగుట్ట ప్రజలు ఇబ్బందులు

**పులివెందుల-సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని పార్నపల్లి బస్టాండ్ నుండి సంతోష్ హోటల్ నుండి నగిరిగొట్టికెళ్లే రూట్ లోని కొన్ని వీధులు గత ఐదు రోజులుగా వీధి దీపాలు వెలుగుక ఆ ప్రాంత వాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. రాత్రివేళ బయటికి రావాలంటే విషపురుగుల బారినపడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాలలో గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతున్నారని ఇప్పుడే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని. వారంటున్నారుమేము ఏమైనా ఇంటి పన్నులు చెల్లించలేదా మున్సిపాలిటీ అధికారులు ఇంత చిన్నచూపు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధిదీపాలను వెలిగే విధంగా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



స్మశాన వాటిక భూమి కబ్జాపై

### తక్షణ చర్యలు తీసుకోవాలి

సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు

**లక్కిరెడ్డిపల్లి-సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి మండలం గ్రామ పరిధిలోని రాచపల్లి స్మశాన వాటిక భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం గ్రామ ప్రజలతో కలిసి కబ్జాకు గురైన స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు, అనంతరం స్థానిక లక్కిరెడ్డిపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి ఉప తాసిల్దార్ రెడ్డన్నకు వినతి పత్రం సమర్పించారు, గత 200 సంవత్సరాల క్రితం నుండి సర్వేనెంబర్ 622,623, లో రాచపల్లిలో ఎవరు చనిపోయిన స్మశాన వాటికలలో పూడ్చి సమాధులు కూడా నిర్మించారు, కానీ స్థలాన్ని కబ్జా చేయడం చట్ట విరుద్ధమే కాకుండా మానవత్వానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

### క్రైస్తవ సోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు

### ఈస్టర్ పండుగ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగ

## క్రైస్తవ్యం కులము కాదు మతము కాదు మోక్షానికి మార్గం



### దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్

**పులివెందుల-సూర్య వాస్తవం:** ఈస్టర్ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన , ముఖ్యమైన పండుగ అని, ఇది యేసుక్రీస్తు సిలువ మరణం తర్వాత మూడవ రోజున తిరిగి సజీవుడిగా లేచిన పునరుత్థానాన్ని స్మరించుకునే రోజు అని, క్రైస్తవ సోదర, సోదరీమణులకు, ఈస్టర్ శుభాకాంక్షలు దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏసుప్రభును అప్పటి పాలకులు కొరడాలతో కొట్టి , ఆయన తలపై ముళ్ళ కిరీటాన్ని పెట్టి హింసించారన్నారు. ఆయనతో బలవంతంగా సిలువను లాగించడం జరిగిందన్నారు. క్రైస్తవ్యం కులం కాదు మతము కాదు మోక్షానికి మార్గమన్నారు. యూదయ రోమన్ గవర్నర్ పొంతి పిలాతు ఆదేశాల మేరకు యేసుక్రీస్తును కల్వరి కొండపై శిలువ వేసి చంపిన తర్వాత, ఆయన సమాధి చేయబడ్డారు అన్నారు. చనిపోయిన మూడవ రోజున యేసు సజీవుడిగా లేచాడని బైబిల్ చెబుతోంది అని ఆయనతెలిపారు. పాపాలకు పరిహారంగా యేసు తనను తాను బలియాగంగా అర్పించి, మరణాన్ని జయించాడని విశ్వాసులు నమ్ముతారు అన్నారు. ఏసుప్రభు శిలువ వేసిన రోజుకు గుర్తుగా ప్రతి సంవత్సరం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈస్టర్ పండగకు ముందు ఇది నిర్వహిస్తారన్నారు. గుడ్ ఫ్రైడే రోజున చర్చికి వెళ్లి ఏసుప్రభు త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. ఇది చీకటిపై వెలుగు, మరణంపై జీవం విజయానికి ప్రతీక అని తెలిపారు. ఈస్టర్ ప్రజలకు నిరీక్షణను, ఆశను ఇస్తుంది అనియేసు లేవడం ద్వారా మరణం తర్వాత కూడా నిత్యజీవం ఉందనే నమ్మకం క్రైస్తవులకు కలుగుతుంది అన్నారు. 40 రోజుల ఉపవాసం ఈస్టరు ముందు 40 రోజుల పాటు క్రీస్తు శ్రమలను స్మరిస్తూ క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు. ఇది పాప ప్రాయశ్చిత్తానికి ప్రతీక అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### తూమకుంటలో ఇంకనూ నిర్మాణంలో ఉన్న

## 100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి

## కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య బ్యూరో-సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూమకుంట గ్రామంలో హెచ్పిసిఎల్ రెన్యువబుల్ అండ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో 500 మెగావాట్ సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఇంకనూ నిర్మాణ దశలో ఉన్న 100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్లాంట్ స్థలాన్ని కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ దశ, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులను, సైట్ ఇంజినీర్లను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేసి వచ్చే నాలుగు నుండి ఐదు నెలల్లో మొత్తం





ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సైట్ ఇంజినీర్ కలెక్టర్‌కు వివరించారు. ప్లాంట్ ఏర్పాటులో కొన్నిచోట్ల భూమి సంబంధిత సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం సహకారం అందించాలని సైట్ ఇంజినీర్ కోరగా, సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత ప్రాంతీయ విద్యుత్ అవసరాలకు గణనీయమైన మద్దతు లభించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు సమయానికి పూర్తి కావడానికి అన్ని శాఖలు



సమన్వయంతో పనిచేయాలని, అదేవిధంగా పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రమాణాలు పాటించాలని, భద్రతా చర్యలు ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రాజెక్టు పి.డి పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి

## రాజ్యసభలో ఆమోదం

ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి గంగమ్మకు మొక్కులు చెల్లించిన, ఎమ్మెల్యే శ్యాంబాబు మరియు చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్

**ప్యాపిలి-సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలం పి ఆర్ పల్లె గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గంగమ్మ జాతర లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టినందుకు భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలను చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు వై. నాగేశ్వరరావు యాదవ్ పాల్గొని ర్యాలీ నిర్వహించడం జరిగింది. అలాగే ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే గంగమ్మ తల్లికి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యా లతో సుఖసంపదలతో విలసిల్లాలని ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి ప్రార్థించడం జరిగింది.

# 'డెకాయిట్' ట్రైలర్ విడుదల




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ నటించిన 'డెకాయిట్' చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుండి థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హరి (అడివి శేష్), జూలియట్ (మృణాల్ ఠాకూర్)ల మధ్య గాఢమైన ప్రేమ కథతో మొదలైన ట్రైలర్.. ఆ తర్వాత ఊహించని నమ్మకద్రోహం, జైలు జీవితం, రివెంజ్ డ్రామాగా మారి ఉత్కంఠ రేపుతోంది. ఒక సాధారణ ప్రేమికుడు పరిస్థితుల ప్రభావం వల్ల 'డెకాయిట్'గా ఎలా మారాడనేదే ఈ చిత్ర ప్రధానాంశంగా తెలుస్తోంది. ఈ చిత్రంతో షానీల్ డియో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తూ టాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# మే 1న 'గాయపడ్డ సింహం' విడుదల




తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'గాయపడ్డ సింహం'. మే 1న ఈ సినిమా థియేటర్ల లో విడుదల కానుంది. పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజరుకృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ప్రీ-వెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ను ఫ్రెష్‌గా, ఫన్‌తో నింపేలా రూపొందించారు. సంగీత దర్శకుడు స్వీకర్ ట్రెండీ బీట్స్‌తో పాటు ఫెస్టివ్ ఫ్లేవర్‌ను అద్భుతంగా మేళవించారు. ఆయన పాడిన ఇంగ్లీష్ పార్ట్స్, శ్రీమణి రాసిన ఎనర్జిటిక్ తెలుగు లైన్స్ కలిసి ఈ పాటకు మంచి ఆదరణ తెచ్చిపెట్టాయి.

# అల్లరి నరేష్‌తో 'కనక దుర్గ' ప్రారంభం



అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అల్లరి నరేష్ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా చిత్రం 'కనక దుర్గ' షూటింగ్ ప్రారంభమైంది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. చిరంజీవి సతీమణి సురేఖ ముఖ్య అతిథిగా హాజరై కెమెరా స్విచ్చాన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దిల్‌రాజు కుటుంబ సభ్యులు, ఆయన భార్య తేజస్విని, కుమార్తె హన్షిత రెడ్డి, స్వప్న దత్, అల్లరి నరేష్ భార్య విరూప తదితరులు పాల్గొన్నారు. ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ గ్రాండ్ లాంచ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. చిత్ర యూనిట్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కథ, నటీనటులు, టెక్నికల్ టీమ్‌పై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

# గ్లోబల్ స్టేజీ పై ఇండియన్ స్టార్ రష్మిక

## - జపాన్ మళ్లీ ఆహ్వానం




హైదరాబాద్ : భారత సినీ పరిశ్రమకు అంతర్జాతీయ వేదికపై మరో గర్వకారణంగా నిలిచారు రష్మిక మందన్న. జపాన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే Crunchyroll Anime Awards 2026 కార్యక్రమానికి ఆమెను మరోసారి ప్రజెంటర్‌గా ఆహ్వానించడం విశేషంగా మారింది. ఈ అవార్డ్స్ వేడుకలో అవార్డులను అందజేసే తొలి భారతీయ సెలబ్రిటీగా ఇప్పటికే రికార్డు సృష్టించిన రష్మిక, వరుసగా రెండోసారి ఎంపిక కావడం ద్వారా తన స్థాయిని మరింత బలపరిచారు. మే 23న జపాన్ రాజధాని టోక్యోలో జరగనున్న ఈ 10వ ఎడిషన్ వేడుకలో ఆమె పాల్గొననున్నారు. ప్రపంచ యానిమేషన్ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ వేదికపై హాలీవుడ్ ప్రముఖులతో కలిసి విజేతలకు అవార్డులు అందించనున్నారు. యానిమే అభిమానిగా గుర్తింపు పొందిన రష్మిక కు, పుష్ప (ది రైజ్) సినిమాతో జపాన్‌లో విపరీతమైన ఆదరణ లభించింది. ఆమె అభినయం, ఎనర్జీకి అక్కడి ప్రేక్షకులు ప్రత్యేకంగా ఆకర్షితులయ్యారు. ఈ వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖ్యంగా విజయ్ దేవరకొండ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనల వర్షం కురిపిస్తున్నారు. అంతర్జాతీయ వేదికపై భారతీయ ప్రతిభను మరోసారి చాటేందుకు సిద్ధమవుతున్న రష్మికకు అన్ని వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.





# గెలుపు ముంగిట గుజరాత్ బోల్తా

అహ్మదాబాద్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19లో రాజస్తాన్ రాయల్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సత్తా చాటింది. తొలి మ్యాచ్‌లో చెన్నైపై 8వికెట్ల తేడాతో గెలిచిన రాజస్తాన్.. నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా శనివారం గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో 6పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. తొలుత రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో భాగంగా గుజరాత్ నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 204పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. గుజరాత్ చివరి 12 బంతుల్లో 15పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్ వేసిన జోఫ్రా ఆర్చర్ 4పరుగులు, 20వ ఓవర్ వేసిన దేశ్‌పాండే కూడా 4పరుగులే ఇచ్చాడు. దీంతో గుజరాత్ గెలుపుకు 6పరుగుల దూరంలో నిలిచింది. అంతకుముందు రాజస్తాన్ ఓపెనర్ జైస్వాల్(55), ధృవ్ జురెల్(75) బ్యాటింగ్‌లో రాణించడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 210 పరుగుల భారీస్కోర్ చేసింది.



# సమీర్ సింహనాదం

## - ముంబయిపై ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు



న్యూఢిల్లీ: ఇంప్యాక్ట్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు సమీర్ రిజ్వీ(90) మరోసారి బ్యాటింగ్‌లో మెరిసాడు. లక్నోపై 70పరుగులతో అజేయంగా నిలిచి ఢిల్లీ గెలుపులో కీలకపాత్ర పోషించిన రిజ్వీ.. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పైనా 90పరుగులతో రాణించాడు. దీంతో ఢిల్లీ జట్టు ముంబయి ఇండియన్స్ నిర్దేశించిన లక్ష్యాన్ని 18.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రిజ్వీకి తోడు నిస్సంక(44), డేవిడ్ మిల్లర్(21నాటౌట్) ఢిల్లీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఇక రిజ్వీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సొంత మైదానంలో రిజ్వీ దూకుడు ముందు ముంబయి ఇండియన్స్ బౌలర్లు తేలిపోగా.. 163 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ ఉఫ్‌మనిపించింది. ఆరంభంలోనే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని రిజ్వీ ఓపెనర్ పథుమ్ నిశాంక(44)తో కలిసి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఈ హిట్టర్‌కు డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) మెరుపులు తోడయ్యాడు. దీంతో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించిన నాలుగు పాయింట్లలో టాప్‌లో నిలిచింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్‌ను ముకేశ్ కుమార్, అక్షర్ పటేల్ విజృంభణతో 18 పరుగులకే రియాన్ రికెల్టన్(9), తిలక్ వర్మ(0)లు పెవిలియన్ చేరారు. ఆ దశలో రోహిత్ శర్మ(35)తో కలిసి సూర్యకుమార్ యాదవ్(51) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. ఆఖర్లో నమన్ ధిర్(28), మిచెల్ శాంట్నర్(18 నాటౌట్)లు బ్యాట్ ఝుళిపించడంతో ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ముఖేష్ కుమార్‌కు రెండు, ఎన్గిడి, అక్షర్, విప్‌రాజ్ నిగమ్, నటరాజన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి)అక్షర్ (బి)ముఖేష్ కుమార్ 9, రోహిత్ శర్మ (సి)నితీశ్ రాణా (బి)అక్షర్ పటేల్ 35, తిలక్ వర్మ (సి అండ్ బి)ముఖేష్ కుమార్ 0, సూర్యకుమార్ యాదవ్ (ఎల్‌బి)ఎన్గిడి 51, రూథర్‌ఫోర్డ్ (సి)ముఖేష్ కుమార్ (బి)విప్‌రాజ్ నిగమ్ 5, నమన్ ధీర్ (సి)స్టబ్స్ (బి)నటరాజన్ 28, సాంట్నర్ (నాటౌట్) 18, బోట్చ్ (నాటౌట్) 11, అదనం 5. (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 162 పరుగులు.

వికెట్ల పతనం: 1/18, 2/18, 3/71, 4/85, 5/122, 6/146

బౌలింగ్: ముఖేష్ కుమార్ 3-0-26-2, ఎన్గిడి 4-0-34-1, అక్షర్ పటేల్ 4-0-22-1, విప్‌రాజ్ 3-0-24-1, కుల్దీప్ 3-0-31-0, నటరాజన్ 3-0-24-1.

ఢిల్లీ క్యాపిటల్ ఇన్నింగ్స్: కెఎల్ రాహుల్ (సి)రికెల్టన్ (బి)దీపక్ చాహర్ 1, నిస్సంక (సి)మార్కండే (బి)సాంట్నర్ 44, నితీశ్ రాణా (రనౌట్)బుమ్రా 0, సమీర్ రిజ్వీ (సి)తిలక్ వర్మ (బి)బోట్చ్ 90, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 21, స్టబ్స్ (నాటౌట్) 3, అదనం 5. (18.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 184పరుగులు.

వికెట్ల పతనం: 1/2, 2/7, 3/73, 4/151

బౌలింగ్: దీపక్ చాహర్ 3-0-20-1, బుమ్రా 4-0-21-0, సాంట్నర్ 3-0-22-1, శార్దూల్ 3-0-41-0, మయాంక్ మార్కండే 2-0-20-0, బోట్చ్ 3.1-0-39-1.

# రేపు రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన

- జేఎన్టీయూలో అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..
- నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితరులు..



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ఈనెల 6వతేదీన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలో అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 6వతేదీన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జేఎన్టీయూలో నిర్వహించే స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి రానున్న నేపథ్యంలో శనివారం



జేఎన్టీయూలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ పర్యటన నేపథ్యంలో గెస్ట్ హౌస్ వద్ద, ఆడిటోరియంలో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డయాస్ ఏర్పాట్లను జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. స్ట్రక్చర్స్ భద్రతను ఆర్.అండ్.బి అధికారులు తనిఖీ చేయాలన్నారు. గోల్డ్ మెడలిస్టులు, విద్యార్థులకు పాసులను మంజూరు చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు, ట్రైన్ ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, ఆర్డీవో కేశవ నాయుడు, డిఎస్పిలి మహబూబ్ భాషా, శ్రీనివాసరావు, జేఎన్టీయూ రిజిస్టర్ కృష్ణయ్య, ఓఎస్డి దేవన్న, పిఆర్వో ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే..... ప్రాముఖ్యం...!

- సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ పరిసరాలలో విస్తృత తనిఖీలు







**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :**

అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా.. శనివారం నాడు మూడవ పట్టణ సి.ఐ. రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది రైల్వే స్టేషన్ మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారి వివరాలను సేకరించారు. సరైన ఆధారాలు లేని వ్యక్తులను ప్రశ్నించి, వారి గమ్యస్థానాలు, ప్రయాణ ఉద్దేశ్యాలపై విచారణ నిర్వహించారు. అవసరమైన సందర్భాల్లో వారి సామాన్లను కూడా తనిఖీ చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు చేపట్టినట్లు సి.ఐ తెలిపారు. ముఖ్యంగా... రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. పోలీసులు ప్రజలకు కూడా పలు సూచనలు చేశారు.

ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు లేదా వస్తువులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమని తెలిపారు. ఈ తనిఖీల్లో త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బృందాలు పాల్గొని సమన్వయంతో చర్యలు చేపట్టారు.

# జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు

- రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా తనిఖీలు





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను అరికట్టడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిం చకపోవడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# కార్యకర్తలను గాలికి వదిలేసి జగన్మోహన్ రెడ్డికి అన్యాయం చేస్తున్నావ్

- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే పై పూలకుంట శివారెడ్డి సంచలన ఆరోపణలు
- మూడుసార్లు ఓడిపోయిన వ్యక్తికి ఎమ్మెల్యే సీటు అవసరమా అని నిలదీత
- రాప్తాడు వైసీపీలో కలకలం రేపిన శివారెడ్డి ప్రెస్ మీట్



**అనంతపురం – సూర్య వాస్తవం :** రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై సొంత పార్టీకి చెందిన ముఖ్య నాయకులు తీవ్రమైన ఆరోపణలతో ప్రెస్ మీట్ పెట్టడం కలకలం రేపినట్లు అయింది. ఇటీవలే రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కొంతమంది వైఎస్ఆర్సిపి నాయకులు పై అధిష్టానంతో సస్పెన్షన్ వేటు వేయించడం జరిగింది. అయితే సస్పెన్షన్ గురైన నాయకులు మాత్రం మేమే నిజమైన వైఎస్ఆర్సిపి కార్యకర్తలమంటూ జగన్మోహన్ రెడ్డి కోసం, వైఎస్ఆర్సిపి పార్టీ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమంటూ నిజమైన వైఎస్ఆర్సిపి అభిమానులను దుర్మార్గంగా వ్యక్తిగత ద్వేషంతో సస్పెండ్ చేయించడం జరిగిందని ఆరోపించారు. ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో అనంతపురం నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే తోపు ప్రకాష్ రెడ్డి వీరి పైన,వీరిని వెనకేసుకుని తిరుగుతున్న నాయకులు పైన ఘాటైన వ్యాఖ్యలు చేయడంతో ఈరోజు ఆయన చేస్తున్న అరాచకాలను అధిష్టానం దృష్టికి,ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నట్లు మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ పూలకుంట శివారెడ్డి పేర్కొన్నారు నాయకులకు పదవులు ఇస్తామని భారీగా డబ్బులు దండుకున్నట్లు భారీగా అక్రమ ఆస్తులు సంపాదించుకున్నట్లు ఇతర అనేకమైన సంచలన ఆరోపణలు చేయడంతో అనంతపురం జిల్లా వైసీపీలో తీవ్ర చర్చనీయాంశమైంది ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వ్యవసాయ కమిటీ మెంబర్ బోయ రాజారాం, రాప్తాడు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్ రెడ్డి పీకే పల్లి మాజీ జడ్పిటిసి ఉన్న హనుమంతు రెడ్డి, పీకే పల్లి మాజీ ఎంపీపీ భర్త రమణ సీనియర్ నాయకుడు మహానంద రెడ్డి, కక్కలపల్లి సీనియర్ నాయకుడు ధనంజయ యాదవ్, రామగిరి మాజీ కన్వీనర్ కుంటిమద్ది రమేష్ తాడిసర్ల సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, చేయడు సర్పంచ్ గంగాధర్ రెడ్డి సోమశేఖర్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



# అమరావతి రాజధానిపై ఉద్యోగుల హర్షం

**కదిరి – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంపై శనివారం సాయంత్రం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో ఉద్యోగులు ఉద్యోగ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు బండారు గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎన్జీవో సంఘం నాయకులు పెన్షనర్ల సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత సాధించడానికి సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్, స్థానిక శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టి రాజధానిని చట్టబద్ధత కల్పించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రత్యేకించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు ఉద్యోగ సంఘ నాయకులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు పై వైసీపీ ఘాటు వ్యాఖ్యలు



**ఉరవకొండ సూర్య వాస్తవం :** బెళుగుప్ప మండల పరిధిలో కొలువైవున్న శ్రీ వెంకటేశ్వర స్వామిని తిరుమల పవిత్రతను కాపోడు కోవాలని వేడుకున్నారు. బీ.ఆర్. నాయుడు మహిళతో అసభ్య సన్నిహితత్వంలో కనిపించారని తిరుమల పవిత్రతకు దెబ్బ తగులుతోందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న ఆధ్వర్యంలో వైసీపీ నేతలు నిరసనలు చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుండి వెంకటేశ్వర గుడి వరకు టీటీడీ చైర్మన్ కూ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తిరుమల పవిత్రను కాపాడాలని గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేశారు. మహిళతో అసభ్య సన్నివేశాల్లో కనిపించిన వ్యక్తి టీటీడీ బోర్డు చైర్మన్ ఉండే అర్హత లేదని ఆరోపించారు. ఇది హిందూ భక్తుల మనో భావనలను కించపరిచిన వ్యక్తి ఈ పదవికి అర్హుడు కాదని వైసీఆర్‌సీపీ రాజీనామా డిమాండ్ చేస్తోంది. ఇతర ఆరోపణలు టీటీడీ భూములు ఓబరాయ్ హోటల్‌కు ఇచ్చారని, వీఐపీలను లాభాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపణలు. చేస్తున్నారు రాజీనామ చేయకుంటే వెంటనే కూటమి ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి ఎస్ సి సెల్ అధ్యక్షుడు సురేష్ నాయక్ బాబూరెడ్డి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 65 సంవత్సరాలు పైబడిన న్యాయవాదులుకు నెలకు రూ. 15 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలి

- ఐ. ఏ. ఎల్. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్ర కుమార్



**పత్తికొండ – సూర్య వాస్తవం :** 65 సంవత్సరాలు పైబడిన న్యాయవాదులు అందరికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు 15 వేల రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ (ఐ. ఏ.ఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్రకుమార్ డిమాండ్ చేసారు. శనివారం పత్తికొండలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వృద్ధాప్యంలో న్యాయ వాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ ంటున్నారు కనుక పెన్షన్స్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం నెలకు 14 వేల రూపాయలు ఇస్తున్నదని గుర్తు చేసారు. అదే తరహాలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా నెలకు 15 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో వాకాలత్ తగ్గిపోయి,జ్ఞాపకశక్తిని కోల్పోయి వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు అందుకోసం 65 సంవ త్సరాలు పైబడిన ప్రతి న్యాయవాదికి రాష్ట్ర ప్రభుత్వం 15 వేల రూపాయలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. కొంతమంది తమ కంటి చూపుని కోల్పోయి చదవలేని పరిస్థితిలో కోర్టుకు రావడం మానేసారని తెలిపారు. వృద్ధాప్యంలో తమ కుటుంబాన్ని పోషించు కోవ డానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు . అనారోగ్య కారణాల రీత్యా డబ్బులు లేక సరైన వైద్యం అందక ఇబ్బందులు పడు తున్నారని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం 15 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడం ద్వారా కనీస ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునే దానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసిన వారికి పెన్షన్ ఇస్తున్నారని, న్యాయ వాదులకు మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 65 సంవత్సరలు పైబడిన న్యాయ వాదులు కు నెలకు 15 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ఐ. ఏ. ఎల్. ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చెపడతామని అయన చెప్పారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# నియోజకవర్గ స్థాయి బడ్జెట్ సమావేశానికి
# హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**శింగనమల-సూర్య వాస్తవం:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగిన బడ్జెట్ అవగాహన కార్యక్రమానికి అనుసంధానంగా శింగనమల నియోజకవర్గ స్థాయి బడ్జెట్ అవగాహన కార్యక్రమం శింగనమల మండల ఎంపీడీఓ ఆఫీసు యందు జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆర్.డి.ఓ. కేసవనాయుడు 6 మండలాల ఎంపీడీఓ లు,తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ నిధుల వ్యయంలో పారదర్శకత పెంచి, కేటాయించిన ప్రతి రూపాయి సద్వినియోగం జరిగేలా కూటమి ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు రూపొందించడమైనది. సాగు, తాగునీటికి సమస్య కు శాశ్వత పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బీ, హౌసింగ్ శాఖల ఆధ్వర్యంలో జరిగే పనులు నిర్లక్ష్య ధోరణి లేకుండా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు వారికి సంబంధించిన గ్రామాలల్లో తాగు నీటి సమస్య,విద్యుత్ సమస్య,వీధి దీపాలు,పారిశుధ్యం సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు.గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయితీ ల పరిధిలో నీటి సమస్య తరచుగా రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే నియోజకవర్గ పరిధిలో నిరుపయోగంగా ఉన్న 23 అంగన్వాడీ కేంద్రాలను తిరిగి ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ గురించి నియోజకవర్గ పరిధిలో సమావేశం జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్లో నియోజకవర్గానికి సంబంధించిన కేటాయింపులుతో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా ఉపయోగించే విధంగా సన్నదంగా అధికారులు ఉండాలని సూచించారు. నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు కి,ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి నియోజకవర్గ ప్రజల తరపున ప్రతేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగనమల మండల అధ్యక్షుడు మారుతి నాయుడు ,సింగల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మి నారాయణ ,రాష్ట్ర నాయి బ్రాహ్మిణ్ డైరెక్టర్ ఆదినారాయణ , శింగనమల ఆయకట్టు ప్రెసిడెంట్ సత్యనారాయణ , రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ,ఇతర నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీలో పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలను మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- గాలివీడు పీహెచ్సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్
- పీహెచ్సీలో సేవల లోపాలు.. సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలకు ఆదేశాలు



**అన్నమయ్య బ్యూరో-సూర్య వాస్తవం:** గాలివీడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవల పనితీరు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.తనిఖీ సమయంలో సిబ్బంది హాజరు పట్టిక సక్రమంగా నిర్వహించకపోవడం, పలువురు సిబ్బంది గైర్హాజరు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రసూతి గది (లేబర్ రూమ్) పరిశీలనలో అత్యవసర మందులు అయిన మెగ్నీషియం సల్ఫేట్, డెక్స్ట్రోస్, అట్రోపిన్,ఆక్సిటోసిన్ మందులు మరియు జంటామైసిన్, డైజోఫాం, మెట్రోనిడజోల్ ఇంజక్షన్లు సక్రమంగా నిల్వ చేయకపోవడం, లేబర్ రూమ్ ప్రోటోకాల్కు అనుగుణంగా అత్యవసర ఔషధాల ట్రే మరియు ఇతర ట్రేలను సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు డ్రగ్ స్టోర్లో మందుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఔషధాల స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో



ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలు, లేబర్ రూమ్, జనరల్ వార్డు, మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రోగులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు కీలక వైద్య సేవలను అందించే కేంద్రాలుగా ఉంటాయని, అక్కడి సేవలు నాణ్యంగా ఉండేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలో తహసీల్దార్, సీఐ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల పక్షపాతి
# బాబు జగజీవన్ రావ్

- డా. లక్ష్మి గారి నాగ లక్ష్మీదేవి
తెలుగు శాఖాధిపతి
ప్రభుత్వ డిగ్రీ కళాశాలారి



**వేంపల్లె సూర్య వాస్తవం :** సమానత్వం సమన్యాయం కోసం జీవించిన మొదటి తరం కాంగ్రెస్ నేత .రోజులు మారాయి. చదువు యొక్క ప్రధాన లక్ష్యం గురించి విద్యార్థి ఆశించడం లేదు .ఆ విద్యార్థిని సరైన దిశలో లో పెట్టాల్సిన తల్లిదండ్రులు, గురువులు కూడా వాటి నుంచి తపి చడం చడం లేదు. ప్రతి ఒక్కరికి కావలసింది ఏ డిగ్రీ చదివితే పెద్ద ఉద్యోగం వస్తుంది, ఏ బహుళ జాతి కంపెనీలో ప్లేస్మెంట్ దొరుకుతుందనే.ఈ నేపథ్యంలో స్వాతంత్ర ఉద్యమం గురించో లేదా దేశ సంస్కృతి గురించో వారసత్వం గురించో ఆలోచించే మానసిక స్థితిలో నేటి ఆధునిక ప్రజలు లేరు. అయితే మహనీయుల జయంతో లేదో వర్ధంతి సందర్భంగా ఆయన వారిని గురించి స్మరించకపోతే భవిష్యత్తు తరాలు ఈ భావాలనే మరిచిపోయే రోజులు వస్తాయేమో.బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ,సాధారణ కుటుంబం నుంచి కేంద్ర ప్రభుత్వం లో మూడు దశాబ్దాల పాటు మంత్రివర్యులుగా సేవలందించిన మహనీయుడు, వీటన్నిటికీ మించి భారతదేశాన్ని బ్రిటిష్ వారి కబంధహస్తాల నుంచి కాపాడుటకు నాయకత్వం వహించిన భారత జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఉద్యమాలలో పాలుపంచుకున్న వ్యక్తి ఈ జటజీవన్ రామ్.మనము స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వారినో లేదా స్వాతంత్రానంతరం భారతదేశ నిర్మాణంలో పాత్రను పోషించిన వారినో మనం వింటుంటాం. అయితే జగజీవన్ రామ్ అటు స్వాతంత్ర పోరాటంలోనూ, ఇటు స్వతంత్ర భారత నిర్మాణంలోనూ కృషి చేసిన ఒక విశిష్టమైన వ్యక్తి . అంటే ప్రముఖ స్వాతంత్ర వీరుడు, సమాజ సంస్కర్త అనగారిన వర్గాల ఆశాజ్యోతి, ప్రతిభావంతుడైన రాజకీయ నాయకుడు ,జీవితాంతం సమానత్వం న్యాయం కొరకు పోరాడిన మనిషిన్నమాట. జగజీవన్ రామ్ ను అందరూ ముద్దుగా" బాబు జగజీవన్ రామ్ "అని అంటారు ,.ఈయన బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామములో ఏప్రిల్ 5, 1908వ సంవత్సరములో శోభిరామ్ ,వాసంతి దేవలకు నిమ్మజాతి కులములో జన్మించెను .బాల్యము నుంచి కుల వివక్షత ఎదుర్కొన్న రామ్ కష్టపడి ప్రాథమిక విద్యను స్థానిక పాఠశాలలో పూర్తిచేశారు . దానితో ఆగక చదువుపై ఉన్న మక్కువతో ఉన్నత విద్య కొరకు ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన బెనారస్, కలకత్తాలను వెళ్లి చదువులను పూర్తి చేశాడు.విశ్వవిద్యాలయంలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్న నాయకుడిగా ఎదిగాడు ఈ విధంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో తన వంతు పాత్రను పోషించాడు. భారత జాతీయ కాంగ్రెస్ 1969లో ఎదుర్కొన్న సమయంలో ఇందిరా గాంధీ పక్షాన వ్యవహరించి దేశములో అత్యున్నత దేశాధ్యక్ష పదవికి కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నిక చేయబడ్డాడు .అయితే ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి, సిండికేట్ గా పిలవబడ్డ అగ్ర శ్రేణి కాంగ్రెస్ నాయకులకున్న అభిప్రాయాల బేధం కారణంగా తృటిలో ఆ పదవిని కోల్పోయాడు. తదనంతరం జరిగిన అనేక పరిణామాల కారణంగా 1977 వ సంవత్సరంలో జగజీవన్ రామ్ కాంగ్రెస్ పార్టీని వీడి కొత్తగా ," కాంగ్రెస్ ఫర్ డెమో క్ర సి"అనే పార్టీని స్థాపించాడు .అయితే ఈ పార్టీ విజయవంతం కాకపోవడం చేత జనతా పార్టీలో విలీనం చేశాడు. ఈ విధంగా స్వాతంత్రోద్యమంలోను, స్వాతంత్ర ఉద్యమం అనంతరం భారతదేశ రాజకీయాలలో దాదాపు నాలుగు దశాబ్దాల కాలం పాటు భారతదేశ రాజకీయాలను ప్రభావితం చేసిన జగజీవన్ రామ్ జులై 6 1980 సంవత్సరంలో పరమపదించడం దురదృష్టం. దేనితో జాతీయ కాంగ్రెస్ తొలి తరపు నాయకుల్లో ఒకడై, జీవితాంతం సమానత్వం, సమ న్యాయం కోసం జీవించిన మహనేత ను దేశం కోల్పోయింది.

# బడ్జెట్ 2026 - 2027 ఔట్రీచ్ ప్రోగ్రాములో పాల్గొన్న సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి






**డోన్- సూర్య వాస్తవం** నంద్యాలలో కలెక్టర్ ఆఫీస్ నందు శుక్రవారం జరిగిన బడ్జెట్ 2026 – 2027 ఔట్రీచ్ ప్రోగ్రాము కి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా ఇంఛార్జ్ రాష్ట్ర ఆర్థికమంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర చట్టం ఑ న్యాయ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు ఎన్.ఎం.డి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గనియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి,నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య,హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు .

# రాయచోటిలో ఘనంగా సితార హాస్పిటల్ ప్రారంభం

**-ప్రారంభించిన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**-టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు శుభవార్త ప్రసాద్ బాబు**



**రాయచోటి-సూర్య వాస్తవం:** నియోజకవర్గ కేంద్రమైనరాయచోటి పట్టణములోని హరినాథ్ వీధిలో గాలివీడు రోడ్, హరనాథవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సితార హాస్పిటల్ ను (ఆర్థో, స్పైన్ మరియు మెటర్నిటీ క్లినిక్) శనివారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాస ప్రసాద్ బాబు లు అంగరంగ వైభవంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాయచోటి ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంఅభినందనీయమన్నారు.ముఖ్యంగా ఎముకల వ్యాధులు, వెన్నుపూస సమస్యలు మరియు గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్యం ఒకే ప్రాంగణంలో లభించడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారు చెప్పారు. వైద్య వృత్తి అనేది పరమ పవిత్రమైనదని, డాక్టర్ పగడాల మణికంఠ బాబు, డాక్టర్ భవ్య లు మానవీయ కోణంలో రోగులకు సేవలు అందించి సితార హాస్పిటల్ను ఆదర్శంగా నిలపాలని కోరారు. ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు నాణ్యమైన వైద్యం అందించి పట్టణ ప్రజల మనలను పొందాలని డాక్టర్ మణికంఠ, డాక్టర్ భవ్య లను వారు కోరారు.ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ఎద్దుల ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వలీ, మాజీ సర్పంచ్ రవీంద్రనాయుడు, మండల అధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు వతన్ సలీం, మన్నేరు రామాంజి, బడిశెట్టి రవి, పాటు పట్టణంలోని పలువురు ప్రముఖ వైద్యులు, ప్రజాప్రతినిధులు, శీను తెలుగుదేశం పార్టీ శ్రేణులు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులు వైద్యులకు మరియు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# "సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్న స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్"



**కనేకల్ -సూర్య వాస్తవం:** ఈ కాలంలో చాలా మంది తమ వ్యక్తిగత జీవితాల్లోనే నిమగ్నమైపోతున్న సమయంలో, సమాజానికి సేవ చేయాలని ముందుకు వచ్చే సంస్థలు ఉండటం నిజంగా అభినందనీయం. అలాంటి సేవాస్ఫూర్తితో ముందుకు సాగుతున్న సంస్థల్లో రాయదుర్గానికి చెందిన స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఒక ప్రముఖమైనది.

కనేకల్ మండలానికి చెందిన సాదిక్ బాషా (సుమారు 30 సంవత్సరాలు) అనే యువకుడు గత 12 సంవత్సరాలుగా మానసిక వైకల్యంతో బాధపడుతూ, మతిస్థిమితంలేని స్థితిలో వీధుల్లో తిరుగుతూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాడు. ఇప్పటివరకు వీధుల్లోనే జీవనం సాగిస్తున్న ఈ యువకుడి పరిస్థితిని పలువురు స్థానికులు కనేకల్ ఎస్సై నాగ మధు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన ఎస్సై నాగ మధు వెంటనే స్పందించి, గతంలో స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన సేవలను దృష్టిలో ఉంచుకుని, ట్రస్ట్ను ఫోన్ ద్వారా సంప్రదించి పరిస్థితిని వివరించారు. సమాచారం అందుకున్న వెంటనే ట్రస్ట్ చైర్మన్ మరియు సభ్యులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టి తమ సేవా తత్వాన్ని మరోసారి చాటుకున్నారు. ఆ ఆశ్రమ నిర్వాహకులు ఆ యువకుడిని అన్ని విధాలా చూసుకుంటామని మాకు హామీ ఇచ్చారు.ఇది కేవలం ఒక వ్యక్తికి చేసిన సహాయం మాత్రమే కాదు, సమాజానికి ఒక గొప్ప సందేశం. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమని గుర్తు చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో అవగాహన పెంచుతున్నాయి,స్వధర్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు నిజంగా ప్రశంసనీయం. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా భావంతో ముందుకు వస్తే, అనేక మంది జీవితాలు మారుతాయి.ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ కలుగోడు మనోజ్ కుమార్ నాయకత్వంలో ఈ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరుకుందాం. ఈ కార్యక్రమంలో కనేకల్ మెడికల్ ఆఫీసర్ మహేంద్ర సార్,హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ కానిస్టేబుల్ సూర్య నారాయణ సురేష్, ట్రస్ట్ రాయదుర్గం పట్టణ అధ్యక్షులు ప్రణీత్, స్థానిక ప్రైవేట్ స్కూల్ టీచర్ రామకృష్ణారెడ్డి , కుసుమల రామకృష్ణారెడ్డి, కదిర్ భాష, షాకీరు, ఫాతిమా తదిరదులు, పాల్గొనడం జరిగింది.